విలేకరులు కావలెను

తెలుగు రాష్ట్రాలలో ప్రజా ఆదరణ పొందుతున్న ప్రజా ముద్ర న్యూస్ ఛానల్ మరియు పత్రిక నందు పనిచేయుటకు అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు మరియు మండలాలు వారీగా రిపోర్టర్స్ (విలేకర్లు) కావలెను. ఆసక్తిగల వారు సంప్రదించండి

95738 00809



ప్రజా ముద్ర

తెలుగు డిజిటల్ దినపత్రిక

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం!

PRAJA MUDRA NEWS

Follow /

సంపుటి: 01 సంచిక: 327 సంపాదకులు కె. నరేష్ కుమార్ 03 సోమవారం ఆగస్టు 2026 పేజీలు: 8 వెల: రూ. 3/-

Published from , Nizamabad, Hyderabad, Rangareddy, Warangal, Medak, Mahabub Nagar, Mahabubabad, Khammam, Karimnagar, Nalgonda, Adilabad


# మాదకద్రవ్యాల రహిత తెలంగాణే లక్ష్యం

**యోగా, ఆధ్యాత్మికతే యువతకు రక్షణ కవచం**
**'డ్రగ్స్ రహిత భారత్.. వికసిత్ భారత్‌కు బలమైన పునాది'**
**గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చొరవ**
**గచ్చిబౌలి శాంతి సరోవర్‌లో '10 కోట్ల మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ' ప్రారంభం**
**రాష్ట్రవ్యాప్త చైతన్యం కోసం ప్రత్యేక ప్రచార వాహనం ప్రారంభం**

హైదరాబాద్ (గచ్చిబౌలి) ఆగస్టు 02:మాదకద్రవ్యాలు లేని సమాజమే వికసిత్ భారత్‌కు బలమైన పునాదిగా నిలుస్తుందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో నిర్వహించిన '10 కోట్ల మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ' కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత, విద్యార్థులతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా చేపట్టిన 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్'లో భాగంగా తెలంగాణలో ఈ బృహత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గవర్నర్ తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతీ పౌరుడు చురుగ్గా భాగస్వామి కావాలని కోరారు.

"భారతీయ యువతే ఈ దేశానికి అసలైన శక్తి. యోగా, ఆధ్యాత్మికత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకుని మాదకద్రవ్యాల మహమ్మారిని తరిమికొట్టాలి."
--శివ ప్రతాప్ శుక్లా, తెలంగాణ గవర్నర్

మిగతా 2లో





# లష్కర్ బోనాల వైభవం

**మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు, బోనం సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి**
**వైభవంగా ప్రారంభమైన సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు**
**మంత్రులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన ముఖ్యమంత్రి**
**తెలంగాణ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని ఆకాంక్ష**
**వేకువజాము నుంచే పోటెత్తిన భక్తజనం, క్యూలైన్లలో మొక్కుల సమర్పణ.**
**భక్తులకు అసౌకర్యం కలగకుండా పోలీసుల విస్తృత భద్రత, అధికారుల పర్యవేక్షణ**

హైదరాబాద్ / సికింద్రాబాద్ (ఆగస్టు 3):తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు (లష్కర్ బోనాలు) ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ పవిత్ర మహోత్సవంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొని జగన్మాతను దర్శించుకున్నారు. మంత్రులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి: సీఎం

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే బోనాల ఉత్సవాలను ప్రజలందరూ ఐకమత్యంతో, పండుగ వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, తెలంగాణ రాష్ట్రంపై ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు."బోనాల ఉత్సవాలు తెలంగాణ ఆత్మగౌరవానికి, భక్తిప్రపత్తులకు నిదర్శనం. ప్రజలందరిపై జగన్మాత చల్లని చూపు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను."
--- ఎ. రేవంత్ రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి

మిగతా 2లో



## మత్తు వదిలితేనే మహోజ్వల భవిష్యత్తు

### అమృత తరానికి ప్రధాని సందేశం!

**పక్కదారి పట్టొద్దు.. మీ ప్రతిభ, సృజనాత్మకతే దేశానికి అసలైన సంపద!**
**దాచడం కాదు.. మార్చడం ముఖ్యం**
**వ్యసనాలపై తల్లిదండ్రులకు పీఎం హృదయపూర్వక పిలుపు!**

న్యూఢిల్లీ ఆగస్టు 02:'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో దేశ యువత ఆరోగ్యమే అత్యంత కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. "నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్" లో భాగంగా చేపట్టిన మాదకద్రవ్య రహిత యువత కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ ఉద్యమం, ఇప్పుడు 125 ఆధ్యాత్మిక సంస్థల సహకారంతో దేశవ్యాప్తంగా విస్తరిస్తోందని వెల్లడించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా దాదాపు కోటి మంది యువకులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. రానున్న 100 వారాల పాటు ఈ డ్రగ్స్ నిర్మూలనా ఉద్యమం స్థిరంగా సాగుతుందని, ప్రతి ఆదివారం.

# బీఆర్ఎస్ బలంగా ఉంది..

**మమ్మల్ని ఎవరూ ఫినిష్ చేయలేరు**
**తెలంగాణ స్వతంత్ర భారత చరిత్రలోనే అత్యంత విజయవంతమైన 'స్టార్టప్ స్టేట్'**
**బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ అగ్రగామి**
**నాలుగేండ్లలోనే కాళేశ్వరం పూర్తి.. టీ హబ్‌తో గ్లోబల్ ఐడెంటిటీ**
**కాంగ్రెస్, బీజేపీలు జాతీయ పార్టీలు కావు..**
**పెద్ద ప్రాంతీయ పార్టీలు మాత్రమే**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని స్వతంత్ర భారత చరిత్రలోనే అత్యంత విజయవంతమైన 'స్టార్టప్ స్టేట్'గా నిలిపామని, అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా తీర్చిదిద్దామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు (కేటీఆర్) పునరుద్ఘాటించారు. ఇటీవలే ఢిల్లీలో ఓ ప్రముఖ మీడియా సంస్థ నిర్వహించిన 'ఐడియా ఎక్స్‌చేంజ్' కార్యక్రమంలో ఆయన పాల్గొని తన అభిప్రాయాలను పంచుకున్నారు.



## లక్ష్యం నీది.. ఖర్చు నాది!

**డాక్టర్ కావాలనుకున్న అఖిల కల నెరవేర్చిన మాజీ మంత్రి హరీశ్‌రావు**
**ఆర్థిక కష్టాల్లో ఉన్న విద్యార్థినికి కొండంత అండ**
**మెరిడియన్ విద్యాసంస్థల చొరవకు అభినందనలు**
**ఇంటికి పిలిచి ఆత్మీయ ఆతిథ్యం.. ఎంబీబీఎస్ సీటు ఎక్కడ వచ్చినా పూర్తి ఫీజు భరిస్తానని హామీ ప్రతిభ కలిగిన పేదలకు చేయూతనందించడం సమాజ బాధ్యత అని పిలుపు**
**సమాజానికి ఉపయోగపడే గొప్ప వైద్యురాలిగా ఎదగాలని అఖిలకు ఆకాంక్ష**

2

## ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే నాయకుల బాధ్యత



**గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి**
**ఈటల రాజేందర్‌ను కలిసిన మేడ్చల్–మల్కాజ్‌గిరి ఓబీసీ మోర్చా నూతన నాయకులు**
**కంద్ర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన**
**పజా సమస్యల పరిష్కారమే ప్రతి కార్యకర్త లక్ష్యం కావాలి**
**ఎంపీ ఈటల రాజేందర్**
**జేకే శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో**
**ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు**

2

పజలు పార్టీపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, నిరంతరం వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే ప్రతి నాయకుడి ప్రాథమిక బాధ్యత అని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు.

ఆదివారం మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జేకే శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన పలు ప్రాంతాల ఓబీసీ మోర్చా నాయకులు ఎంపీ ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన నాయకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



## సముద్రపు కోరల్లో స్నేహం

**ఫొటోలు దిగుతుండగా విధి వెక్కిరింత**
**వైజాగ్ బీచ్‌లో కన్నీటి తీరం**
**ఆనందం ఆవిరి..**
**అలల ప్రవాహంలో ఇద్దరు గల్లంతు!**
**బీచ్ ప్రయాణం -- అమాయక ప్రాణం**
**తీరం దాటి వెళ్తే ముప్పు తప్పదు**

2

ప్రజా ముద్ర
సోమవారం 03-08-2026

## లష్కర్ బోనాల వైభవం



ప్రముఖుల సమక్షం -- కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
ఈ పూజా కార్యక్రమంలో సీఎం వెంట మంత్రులు కొండా సురేఖ (అటవీ, పర్యావరణ శాఖ), పొన్నం ప్రభాకర్ (రవాణా శాఖ), దనసరి అనసూయ సీతక్క (పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ)లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.
లష్కర్ బోనాల నేపథ్యంలో వేకువజాము నుంచే ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. వేలాదిమంది భక్తులు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల నడుమ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.
కట్టుదిట్టమైన భద్రత ఽ క్యూలైన్ల నిర్వహణ
ముఖ్యమంత్రి పర్యటన మరియు భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని నగర పోలీసులు ఆలయ పరిసర ప్రాంతాల్లో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, తాగునీరు, క్యూలైన్ల నిర్వహణ తదితర సౌకర్యాలను అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించారు.

## మాదకద్రవ్యాల రహిత తెలంగాణే లక్ష్యం

ప్రత్యేక ప్రచార వాహనం ఆవిష్కరణ
ఈ కార్యక్రమంలో భాగంగా '10 కోట్ల మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ' పోస్టర్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. తెలంగాణవ్యాప్తంగా డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు రూపొందించిన ప్రత్యేక అవగాహన వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు.
సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి
మాదకద్రవ్యాల రహిత సమాజం దిశగా ప్రభుత్వాలతో పాటు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, తల్లిదండ్రులు చేతులు కలపాలని ఆయన సూచించారు. యువతను తప్పుదోవ పట్టకుండా కాపాడుకోవడం మనందరి సామాజిక బాధ్యత అని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు, విద్యార్థులు, యువకులు మరియు వివిధ విభాగాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మత్తు వదిలితేనే మహోజ్వల భవిష్యత్తు..

'మాదకద్రవ్య రహిత భారత్' దిశగా ఒక బలమైన అడుగు కానుందని పీఎం తెలిపారు. డ్రగ్స్ స్మగ్లర్లు, అక్రమ రవాణాదారులపై ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందని.. గతంతో పోలిస్తే అరెస్టుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాకుండా వేల కోట్ల రూపాయల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు.
2047 నాటి వికసిత్ భారత్: "మీరు భారతదేశ అమృత తరం. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరడంలో యువతదే ముఖ్య భూమిక. డ్రగ్స్ ఇచ్చే తాత్కాలిక ఉత్సాహం మీ కెరీర్‌ను, జీవితాన్ని నాశనం చేస్తుంది. దేశానికి మీ శక్తి, సృజనాత్మకత ఎంతో అవసరం" అని పిలుపునిచ్చారు.
తల్లిదండ్రులకు సూచన: ఇంట్లోని పిల్లలు వ్యసనానికి బానిసైతే సామాజిక ప్రతిష్ట పేరుతో దాచవద్దని, వైద్య సహాయం తీసుకుని వారిని వ్యసనం నుంచి విముక్తి చేయాలని తల్లిదండ్రులకు ప్రధాని విజ్ఞప్తి చేశారు

## ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే నాయకుల బాధ్యత

మల్కాజ్‌గిరి ఆగస్టు 02:ప్రజలు పార్టీపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, నిరంతరం వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే ప్రతి నాయకుడి ప్రాథమిక బాధ్యత అని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు.
ఆదివారం మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జేకే శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన పలు ప్రాంతాల ఓబీసీ మోర్చా నాయకులు ఎంపీ ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన నాయకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పార్టీ విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారం, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులతో సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు.
సమిష్టి కృషితో ముందుకెళ్లాలిఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమమే ప్రతి కార్యకర్త లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు. నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, సేవాభావంతో పనిచేసి వారి మన్ననలు పొందాలని సూచించారు. సమిష్టి కృషితో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు.
రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ వివరించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు గిరివర్ధన్ రెడ్డి, నందనం దివాకర్, ఓబీసీ మోర్చా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సముద్రపు కోరల్లో స్నేహం

విశాఖపట్నం ఆగస్టు 02:స్నేహితుల దినోత్సవం (ఫ్రెండ్‌షిప్ డే) ఆనందం ఆ ఇంట్లో తీవ్ర విషాదాన్ని నింపింది. వైజాగ్ సముద్ర తీరంలో సరదాగా గడిపేందుకు వచ్చిన ఇద్దరు యువకులు అలల ఉధృతికి కొట్టుకుపోయి గల్లంతయ్యారు.
సమాచారం ప్రకారం.. పెదజాలరిపేటకు చెందిన నీతు అనే యువతి తన స్నేహితులతో కలిసి ఫ్రెండ్‌షిప్ డే వేడుకల కోసం బీచ్‌కు వచ్చింది. తీరంలో ఉత్సాహంగా ఫోటోలు దిగుతున్న సమయంలో ఒక్కసారిగా వచ్చిన భారీ రాకాసి అల నీతును సముద్రంలోకి లాక్కెళ్లింది. అది గమనించిన రాము అనే యువకుడు ఆమెను కాపాడేందుకు తక్షణమే సముద్రంలోకి దూకాడు. అయితే అలల వేగం ఎక్కువగా ఉండటంతో నీతుతో పాటు రాము కూడా నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు.
**రంగంలోకి సహాయక బృందాలు**
ఘటనను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సముద్ర భద్రతా సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ప్రత్యేక పడవల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని అధికారులు తెలిపారు. పర్యాటకులు, యువత సముద్ర తీరాల వద్ద అప్రమత్తంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ప్రజల ముంగిట్లోకి మౌలిక వసతులు..

**నెల్లూరు ఆగస్టు 02:**సామాజిక సంక్షేమంతో పాటు ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. నెల్లూరు నగరంలోని 4వ డివిజన్ దీనదయాళ్ నగర్‌లో ఆదివారం ఆయన ఇంటింటికీ తిరిగి 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.
రెండు నెలల్లో రోడ్ల నిర్మాణం పూర్తి
దీనదయాళ్ నగర్‌లో పెండింగ్‌లో ఉన్న రహదారి పనులపై మంత్రి ఆరా తీశారు. పనులను మరింత వేగవంతం చేసి, రానున్న రెండు నెలల్లో ఎండ్-టు-ఎండ్ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఘాటుగా ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు.
సామాజిక న్యాయానికి పెద్దపీట
సమాజంలోని ప్రతి వర్గానికి గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో ట్రాన్స్‌జెండర్ సోదరసోదరీమణులకు ఇళ్లను కేటాయించడం ప్రభుత్వం సామాజిక న్యాయానికి ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని అన్నారు. పెన్షన్ల పంపిణీ సందర్భంగా స్థానిక ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా.. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్యం నీది.. ఖర్చు నాది!

సిద్దిపేటఆగస్టు 02:ఆర్థిక ఇబ్బందులతో వైద్య విద్య కొనసాగింపుపై ఆందోళన చెందుతున్న అఖిల అనే ప్రతిభావంతమైన విద్యార్థినికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అండగా నిలిచారు. ఎంబీబీఎస్ సీటు ఎక్కడ వచ్చినా ఆమె చదువుకు అయ్యే పూర్తి ఫీజును తానే భరిస్తానని ప్రకటించి ఆ విద్యార్థినికి మనోధైర్యాన్ని నింపారు.
**కష్టకాలం నుంచి కంటిపాపలా..**
బీఆర్ఎస్ పార్టీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. నాలుగేళ్ల క్రితం అఖిల తండ్రి మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఆ సమయంలో అఖిల కుటుంబ సభ్యులు హరీశ్‌రావును ఆశ్రయించగా, ఆయన ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మెరిడియన్ విద్యాసంస్థల సహకారంతో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అఖిల విద్యాభ్యాసం ఉచితంగా పూర్తయ్యేలా చూశారు.
**ఆత్మీయ ఆతిథ్యం.. భవిష్యత్తుకు భరోసా**
ఇటీవల నిర్వహించిన జాతీయ అర్హత సాధన ప్రవేశ పరీక్ష రాసిన అఖిలను హరీశ్‌రావు తన నివాసానికి ఆహ్వానించారు. ఆమెను ఆత్మీయంగా పలకరించి, భోజనం పెట్టి మాట్లాడారు."ఆర్థిక కారణాలతో ఏ ఒక్క ప్రతిభావంతురాలైన పేద విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకూడదు. ధైర్యంగా ఉండు.. నీకు ఎక్కడ సీటు వచ్చినా వైద్య విద్య పూర్తయ్యేంత వరకు అయ్యే ఖర్చులన్నీ నేనే చూసుకుంటాను."
--- తన్నీరు హరీశ్‌రావు, సిద్దిపేట ఎమ్మెల్యే
**విద్యాసంస్థల సామాజిక బాధ్యత అభినందనీయం**
అఖిలను పాఠశాల స్థాయి నుంచి ప్రోత్సహించిన మెరిడియన్ విద్యాసంస్థల యాజమాన్యాన్ని ఈ సందర్భంగా హరీశ్‌రావు ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో ప్రతిభ ఉండి పేదరికంలో ఉన్న విద్యార్థులకు చేయూతనందించేందుకు మరిన్ని విద్యాసంస్థలు, దాతలు ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ సహాయంతో అఖిల తన డాక్టర్ కలను నెరవేర్చుకుని, భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే ఉత్తమ వైద్యురాలిగా ఎదగాలని శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణలో బీఆర్ఎస్ బలంగా ఉంది..

న్యూఢిల్లీ ఆగస్టు 02: బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని స్వతంత్ర భారత చరిత్రలోనే అత్యంత విజయవంతమైన 'స్టార్టప్ స్టేట్'గా నిలిపామని, అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా తీర్చిదిద్దామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు (కేటీఆర్) పునరుద్ఘాటించారు. ఇటీవలే ఢిల్లీలో ఓ ప్రముఖ మీడియా సంస్థ నిర్వహించిన 'ఐడియా ఎక్స్‌చేంజ్' కార్యక్రమంలో ఆయన పాల్గొని తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా సమకాలీన రాజకీయాలు, డీలిమిటేషన్, పార్టీ ఫిరాయింపులు, జెన్‌జీ ఉద్యమాలతో పాటు పదేండ్లలో సాధించిన ప్రగతిని గణాంకాలతో వివరించారు.
తలసరి ఆదాయంలో దేశంలోనే ఫస్ట్!
2014లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.94 వేలుగా ఉంటే, 2023 నాటికి అది రూ.3.27 లక్షలకు పెరిగిందని కేటీఆర్ తెలిపారు. ఇది జాతీయ సగటు కంటే రెట్టింపని, దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం సాధించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని వివరించారు. అలాగే, 2014లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.4.5 లక్షల కోట్లుగా ఉండగా, 2023 నాటికి రూ.15 లక్షల కోట్లకు చేరిందని గుర్తుచేశారు.
కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్
తాము నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పథకమని కేటీఆర్ పేర్కొన్నారు. 'ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసినా ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ 'కాళేశ్వరం' అనే వస్తుంది. సముద్ర మట్టానికి 80 మీటర్ల ఎత్తులోని నీటిని, పలు దశల్లో 620 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోసే ఈ భారీ ప్రాజెక్టును నాలుగేండ్ల వ్యవధిలోనే పూర్తిచేశాం."
భాక్రానంగల్, నర్మద వంటి ప్రాజెక్టుల నిర్మాణానికి దశాబ్దాల కాలం పట్టిందని, అయితే కాళేశ్వరం లాంటి ప్రాజెక్టును జాతీయ పార్టీలు నిర్మించి ఉంటే దేశవ్యాప్తంగా ప్రచారం లభించేదని వ్యాఖ్యానించారు.
స్టార్టప్‌లకు ఆదర్శం 'టీ హబ్'
హైదరాబాద్‌లోని 'టీ హబ్' ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్‌గా ఎదిగిందని, మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టికి ఇది నిదర్శనమని చెప్పారు. టీ హబ్ ద్వారా 'స్కైరూట్' వంటి ప్రముఖ సంస్థలు వెలుగులోకి వచ్చాయన్నారు. అంతేకాకుండా, వరి ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందని, ఐటీ, పరిశ్రమలు, సంక్షేమం, మౌలిక వసతుల రంగాల్లో రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధించిందని తెలిపారు.
బీఆర్ఎస్‌ను ఎవరూ ఫినిష్ చేయలేరు
కాంగ్రెస్, బీజేపీలు జాతీయ పార్టీలు కావు అని, అవి కేవలం పెద్ద ప్రాంతీయ పార్టీలు మాత్రమేనని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి బలమైన పునాదులు ఉన్నాయని, రాష్ట్రంలో తమ పార్టీని ఎవరూ ఫినిష్ చేయలేరని స్పష్టం చేశారు.

# ఉజ్జయిని అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 2 : సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి లష్కర్ బోనాలు ఆదివారం ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కేటీఆర్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి కేటీఆర్ అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. బోనాల వేడుకల సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండగా, పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగాయి. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప పండుగ అని అన్నారు. కులాలు, మతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసి జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సమాజ ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో బోనాల పండుగకు తగిన గుర్తింపు లభించలేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తు చేశారు. అమ్మవారి ఆశీస్సులతోనే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని కేసీఆర్ ఎప్పుడూ చెప్పేవారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించి పండుగలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సంతోషంగా ఉండాలని, పాడిపంటలతో తెలంగాణ సస్యశ్యామలంగా మారాలని అమ్మవారిని ప్రార్థించినట్లు కేటీఆర్ తెలిపారు. రైతుల సంక్షేమం, ప్రజల సుఖశాంతుల కోసం ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నానని చెప్పారు. బోనాల వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధల నడుమ కొనసాగుతున్న లష్కర్ బోనాలు తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబిస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.





# ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు

**నల్లగొండ, ఆగస్టు 2 :** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ సాయినగర్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యతను అధికారులతో కలిసి సమీక్షించి,



ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా పనులను వేగవంతం చేయాలని సూచించారు. పరిశీలన సందర్భంగా రహదారులు, కాలువలు, తాగునీటి సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణాలను మంత్రి పరిశీలించారు. పనులు నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా జరుగుతున్నాయా లేదా అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా నాణ్యతలో రాజీ పడకుండా ప్రతి పనిని పర్యవేక్షించాలని ఆదేశించారు.అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. నిర్మాణాలు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పనుల్లో జాప్యానికి అవకాశం ఇవ్వొద్దని స్పష్టం చేశారు. ప్రజలకు ఉపయోగపడే మౌలిక వసతుల కల్పనలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి కాలనీకి మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా కార్యాచరణ కొనసాగుతోందన్నారు.నల్లగొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి వెల్లడించారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకు నగరంలో మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతతో పూర్తి చేయాలని మంత్రి మరోసారి అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

# గోదావరి నదిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

**మల్లాపూర్ ఎస్ఐ విజ్ఞప్తి..**

జగిత్యాల జిల్లా, మల్లాపూర్, ఆగస్టు 02(ప్రజా ముద్ర న్యూస్) :మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓబులాపూర్ గ్రామ శివారు గోదావరి నదిలో ఆదివారం ఒక గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎ.అనిల్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

మహిళ భౌతిక వివరాలు ఆనవాళ్లు:

వయస్సు సుమారు 25 నుండి 35 సంవత్సరాలు ఉంటాయి.

ధరించిన దుస్తులు: నావి బ్లూ రంగు డిజైన్ ఉన్న టాప్, పసుపు రంగు ప్యాంట్.

ఇతర ఆనవాళ్లు:

చేతులకు ఎరుపు మరియు ఆకుపచ్చ రంగు గాజులు ఉన్నాయి. కుడి చేతిపై తెలుగులో "అమ్మ" అని వేయబడిన టాటూ ఉంది.

పోలీసుల విజ్ఞప్తి:

ఈ ఆనవాళ్లు కలిగిన మహిళకు సంబంధించి ఎవరికైనా ఎలాంటి సమాచారం తెలిసినా, లేదా కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరైనా ఉంటే వెంటనే మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌ను కానీ, లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్‌ను కానీ సంప్రదించాలని ఎస్ఐ కోరారు.సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 8712656796 (ఎ. అనిల్, ఎస్సై -మల్లాపూర్)



# అస్తవ్యస్తంగా మారిన టీజీ పల్లి--కామనపల్లి బీటీ రోడ్డు

**పూర్తిగా పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు..**

**మండిపడుతున్న ప్రయాణికులు**

**రూ.1.40 కోట్లు మంజూరైనా ప్రారంభంకాని పనులు**

**అధికారుల నిర్లక్ష్యంపై ప్రయాణికుల తీవ్ర ఆగ్రహం**

మంచిర్యాల జిల్లా, జన్నారం, ఆగస్టు 02(ప్రజా ముద్ర న్యూస్) : జన్నారం మండలంలోని టీజీపల్లి నుంచి కామనపల్లి వరకు ఉన్న బీటీ రహదారి పూర్తిగా దెబ్బతిని అస్తవ్యస్తంగా తయారైంది. రోడ్డంతా పెద్ద పెద్ద గుంతలమయంగా మారడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలను ఎదుర్కొంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ప్రస్తుత వర్షాకాలంలో గుంతల్లో నీరు చేరి గోతుల లోతు తెలియక ద్విచక్ర వాహనదారులు తరచూ కిందపడి గాయపడుతున్నారు. ఈ రహదారి పునర్నిర్మాణానికి గత సంవత్సరం ఆగస్టులోనే ప్రభుత్వం సుమారు రూ. 1.40 కోట్లు నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరై ఏడాది కావస్తున్నా, అధికారులు ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడంపై స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే విద్యాసంస్థల విద్యార్థులు, పొలాలకు వెళ్లే రైతులు, వివిధ ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారని స్థానికులు తెలిపారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, మంజూరైన నిధులతో తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి ప్రమాదాల నుంచి తమను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# ఆదివాసీలపై దాడి చేసిన అటవీ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ డిమాండ్**

**24 గంటల్లో చర్యలు తీసుకుంటామని అధికారుల హామీ**

**హామీతో రాత్రి 11:30 గంటలకు రాస్తారోకో విరమించిన ఆదివాసీలు**

మంచిర్యాల/జన్నారం, ఆగస్టు 02(ప్రజా ముద్ర న్యూస్) :చేపల వేట కోసం అడవిలోని వాగు వద్దకు వెళ్లిన ఆదివాసీ యువకులపై విచక్షణారహితంగా దాడి చేసిన అటవీ శాఖ అధికారులపై 24 గంటల్లో కఠిన చర్యలు తీసుకోవాలని ఖానాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందనపల్లి నాయకపుగూడకు చెందిన ఐదుగురు ఆదివాసీ యువకులను అటవీ అధికారులు అదుపులోకి తీసుకుని లాఠీలతో తీవ్రంగా కొట్టారని ఆరోపిస్తూ బాధితులు, ఆదివాసీలు ఇంధనపల్లి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఎదుట ఆదివారం రాత్రి భారీ రాస్తారోకో నిర్వహించారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వెంటనే ఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించి, వారికి పూర్తినైతిక మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అటవీ అధికారుల నిరంకుశ వైఖరిని సహించేది లేదని, బాధ్యులైన అధికారులపై ఉన్నతాధికారులు 24 గంటల్లో చర్యలు తీసుకోకపోతే ఆందోళనను రాష్ట్రస్థాయిలో ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారుల జోక్యంతో ముగిసిన నిరసన:

పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మందా మకరందం, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, జన్నారం ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్, దండేపల్లి ఎస్సై రాజవర్ధన్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను సమీక్షించారు. బాధ్యులైన అటవీ అధికారులపై 24 గంటల్లో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు ఖచ్చితమైన హామీ ఇవ్వడంతో, ఆదివాసీలు రాత్రి సుమారు 11:30 గంటలకు తమ రాస్తారోకో ఆందోళనను విరమించారు.





# డ్యూటీలో మద్యం మత్తులో కాంట్రాక్ట్ ఉద్యోగి

**విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్లక్ష్యం.. గ్రామస్థుల్లో ఆందోళన**

జగిత్యాల జిల్ల/ఇబ్రహీంపట్నం,ఆగస్టు 03(ప్రజా ముద్ర న్యూస్) : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామ విద్యుత్ సరఫరాకు కీలకమైన వర్షకొండ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆదివారం జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. విధుల్లో ఉన్న ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి డ్యూటీ సమయంలోనే మద్యం మత్తులో కనిపించడం తీవ్ర విమర్శలకు దారితీసింది.సమాచారం ప్రకారం, సబ్‌స్టేషన్‌లోని కుర్చీలో కూర్చొని మద్యం సేవిస్తున్నట్లు కనిపించిన ఉద్యోగికి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. టేబుల్‌పై మద్యం గ్లాస్ కూడా కనిపించడం చర్చనీయాంశంగా మారింది. విద్యుత్ సరఫరా వంటి అత్యంత కీలకమైన బాధ్యతలను నిర్వహించాల్సిన ఉద్యోగి విధి నిర్వహణను విస్మరించి మద్యం మత్తులో ఉండడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సబ్‌స్టేషన్‌లో శాశ్వత ఆపరేటర్ల కొరత కారణంగా తాత్కాలికంగా కాంట్రాక్ట్ ఉద్యోగులతో విధులు నిర్వహిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి సున్నితమైన కేంద్రంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వల్ల ఎలాంటి ప్రమాదాలు సంభవించినా భారీ నష్టం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వేలాది మంది ప్రజలకు విద్యుత్ సరఫరా చేసే ఉపకేంద్రంలో ఇలాంటి నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించరాదని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ ఘటనపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి, బాధ్యుడైన ఉద్యోగిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, డ్యూటీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్ట్ ఉద్యోగిని విధుల నుంచి తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# సంపాదకీయం

## తెరల వెనుక తుఫాను

### డిజిటల్ వ్యసనంలో చిక్కుతున్న భావితరాలు

నేటి ప్రపంచం డిజిటల్ విప్లవంతో వేగంగా పరిగెడుతోంది. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు విద్యార్థుల నిత్యజీవితంలో అంతర్భాగమయ్యాయి. ఒకప్పుడు పాఠ్యపుస్తకాలు, గ్రంథాలయాలు, ఉపాధ్యాయులే జ్ఞానానికి ప్రధాన వనరులుగా ఉండేవి. నేడు సమాచారమంతా అరచేతిలోకి వచ్చేసింది. సాంకేతికత విద్యను సులభతరం చేసిన మాట వాస్తవమే అయినా, సరైన నియంత్రణ లేని వినియోగం విద్యార్థులను ప్రమాదకరమైన 'డిజిటల్ వ్యసనం' వైపు నెట్టివేస్తోంది.

అరచేతిలో ప్రపంచం... బందీ అవుతున్న బాల్యం

చదువు సాధనంగా మొదలైన తెరల వినియోగం... క్రమంగా వినోదం, సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్, అంతులేని వీడియోల వీక్షణగా రూపాంతరం చెందుతోంది. కొన్ని సంవత్సరాల క్రితం వరకు పెద్దల అవసరాలకే పరిమితమైన మొబైల్, నేడు పసిపిల్లల చేతుల్లోనూ నిత్యకృత్యమైంది. పిల్లలు ఏడిస్తే ఫోన్



ఇవ్వడం, అన్నం తినిపించడానికి వీడియోలు చూపించడం, తాత్కాలిక ప్రశాంతత కోసం గంటల తరబడి చేతికి మొబైల్ ఇవ్వడం తల్లిదండ్రులకు అలవాటుగా మారింది. చిన్నవయసులోనే మొదలవుతున్న ఈ అలవాటు, పెరిగే కొద్దీ తీవ్రమైన వ్యసనంగా మారి మొబైల్ లేకపోతే అసహనం, కోపం, చిరాకు, ఆందోళన వంటి మానసిక వైపరీత్యాలకు దారితీస్తోంది.

చదువుకు గండి... శారీరక ఆరోగ్యానికి గండం

ఈ వ్యసనం విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. తరగతి గదిలో శరీరం ఉన్నా, మనసు మాత్రం మొబైల్ తెరపైనే విహరిస్తోంది. ఇంటికి రాగానే చదువును పక్కనపెట్టి సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఆటలకే ప్రాధాన్యమిస్తున్నారు. ఫలితంగా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మందగించి మార్కులు తగ్గడమే కాకుండా, సృజనాత్మక ఆలోచనలు నశించిపోతున్నాయి. చదువుపై ఆసక్తి నశించి బడి మానేసే పరిస్థితులూ ఉత్పన్నమవుతున్నాయి.

మరోవైపు శారీరక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోంది. గంటల తరబడి స్క్రీన్



వంక చూడటం వల్ల కంటిచూపు మందగించడం, తలనొప్పి, మెడ, వెన్నునొప్పులు సర్వసాధారణమయ్యాయి. మైదానాల్లో ఆడాల్సిన వయసులో కూర్చున్న చోటే గడపడం వల్ల చిన్నతనంలోనే ఊబకాయం, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులు ముసురుకుంటున్నాయి.

అభూత కల్పనలు... దెబ్బతింటున్న మానసిక స్థైర్యం

మానసిక ఆరోగ్యంపై డిజిటల్ ప్రభావం మరీ ఆందోళనకరం. అర్ధరాత్రి వరకు ఫోన్లు వాడటంతో నిద్రలేమి, అలసట, మానసిక ఒత్తిడి విద్యార్థులను క్రుంగదీస్తున్నాయి. సోషల్ మీడియాలో కనిపించే మెరుపులను చూసి తమ జీవితాలతో పోల్చుకుంటూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. వర్చువల్ లైక్‌లు, ప్రశంసల కోసం ప్రాకులాడటం, చిన్నపాటి విమర్శలకే కుంగిపోవడం వంటివి తీవ్ర సామాజిక సవాలుగా పరిణమించాయి.

పరికరాలు కాదు... ప్రాధాన్యత సమయం కావాలి!

ఈ పరిస్థితికి విద్యార్థులను మాత్రమే బాధ్యులను చేయడం సరికాదు. కుటుంబ వాతావరణం, తల్లిదండ్రుల వైఖరి కూడా ప్రధాన కారణమే. పిల్లలకు సమయం ఇవ్వలేక, వారి చేతికి పరికరాలు ఇవ్వడం తాత్కాలిక ఉపశమనమే తప్ప దీర్ఘకాలిక ముప్పు. ఇంట్లో పెద్దలు కూడా ఫోన్లలో మునిగిపోతూ పిల్లలకు తప్పుడు సంకేతాలు ఇస్తున్నారు. ఒకప్పుడు ఇంట్లో సాగే భోజన సమయాల ముచ్చట్లు, కథలు చెప్పడం, పుస్తకాలు చదివించడం వంటి సత్సంప్రదాయాలు నేడు మృగ్యమయ్యాయి.

'డిజిటల్ క్రమశిక్షణే' తక్షణ పరిష్కారం

పాఠశాలలు, కళాశాలలు డిజిటల్ పరికరాల వినియోగంతో పాటు వాటి దుష్ప్రభావాలపై విద్యార్థుల్లో చైతన్యం తేవాలి. క్రీడలు, యోగా, ధ్యానం, గ్రంథాలయాల వినియోగానికి అధిక ప్రాధాన్యమివ్వాలి. అవసరమైతే పాఠశాలల్లో కౌన్సెలర్ల సేవలను అందుబాటులోకి తేవాలి. ప్రభుత్వాలు ఆన్‌లైన్ గేమింగ్, అనుచిత సమాచారంపై కఠిన పర్యవేక్షణ ఉంచాలి. తల్లిదండ్రులకు డిజిటల్ పేరెంటింగ్‌పై అవగాహన సదస్సులు నిర్వహించాలి.

సాంకేతికతను పూర్తిగా రద్దు చేయడం సాధ్యం కాదు, అవసరమూ కాదు. కానీ 'డిజిటల్ క్రమశిక్షణ' (ఐఉస్త్రట్ఝ్ర్ఢశ్రీ ఐఱంఎఱజూశ్రీఱఅవ) తప్పనిసరి. సాంకేతికత జ్ఞానాన్ని పెంచే సాధనంగా ఉండాలి తప్ప, జీవితాన్ని శాసించే వ్యసనంగా మారకూడదు. రేపటి దేశ భవిష్యత్తైన విద్యార్థుల చేతుల్లో పుస్తకాలు ఉండాల్సిన సమయంలో మొబైల్లు శాశ్వత సహచరులుగా మారితే అది దేశ ప్రగతికే ముప్పు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు సమన్వయంతో వ్యవహరించి "తెరలపై నియంత్రణ -- జీవితంపై బాధ్యత" అనే సూత్రాన్ని అలవర్చినప్పుడే భావితరాలకు ఉజ్జ్వల భవిష్యత్తు దక్కుతుంది.

## ఆధ్యాత్మిక వాతావరణంలో తొలి శ్రావణ సోమవారం

డెస్క్, ఆగస్టు 2 : హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసానికి అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. ఈ నెలలో వచ్చే ప్రతి సోమవారం శివారాధనకు ఎంతో పవిత్రమైనదిగా భావిస్తారు. ఈ ఏడాది ఆగస్టు 3న తొలి శ్రావణ సోమవారం సందర్భంగా దేశవ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాల్లో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు,



లింగార్చనలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయాలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. పురాణాల ప్రకారం శ్రావణ మాసం శివుడికి అత్యంత ప్రీతికరమైన కాలంగా భావిస్తారు. ఈ నెలలో శివుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని విశ్వాసం. ముఖ్యంగా సోమవారం రోజున ఉపవాసం ఉండి బిల్వదళాలు, గంగాజలం, పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీటితో అభిషేకం చేస్తే విశేష ఫలితం లభిస్తుందని శైవాగమాలు పేర్కొంటున్నాయి. అందుకే శ్రావణ సోమవారాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

తొలి శ్రావణ సోమవారం సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో శివాలయాలను సందర్శిస్తారు. కుటుంబ సౌఖ్యం, దాంపత్య ఆనందం, సంతాన సౌభాగ్యం, ఆయురారోగ్యాల కోసం ఉపవాస దీక్షలు చేపట్టి శివపార్వతులను ఆరాధిస్తారు. యువతులు మంచి వరుడు లభించాలని, వివాహితులు కుటుంబ శ్రేయస్సు కోసం ప్రత్యేక వ్రతాలు ఆచరిస్తారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. దేశంలోని ప్రముఖ శైవక్షేత్రాలు ఈ సందర్భంగా ప్రత్యేక శోభను సంతరించుకుంటాయి. కాశీ విశ్వనాథ్, కేదార్‌నాథ్, సోమనాథ్, మహాకాళేశ్వర్, శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం, యాదాద్రి పరిసరాల్లోని శివాలయాలు, తెలంగాణలోని అనేక ప్రసిద్ధ శివక్షేత్రాలకు వేలాది మంది భక్తులు తరలివెళ్తారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు, క్యూలైన్లు, భద్రతా చర్యలను చేపడుతున్నారు.

శ్రావణ మాసంలో రుద్రాభిషేకానికి విశేష ప్రాధాన్యం ఉంది. శివలింగానికి పవిత్ర జలాలు, పంచామృతాలతో అభిషేకం చేయడం ద్వారా మనసుకు ప్రశాంతత, ఆధ్యాత్మిక ఆనందం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. బిల్వదళాలతో అర్చన, మహామృత్యుంజయ మంత్రం, పంచాక్షరి మంత్రం జపించడం ద్వారా శుభఫలితాలు కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి. అనేక మంది భక్తులు ఈ రోజున రుద్రపారాయణం, శివపురాణ పారాయణం కూడా నిర్వహిస్తారు. శ్రావణ సోమవారాల్లో ఉపవాసం ఉండడం కూడా సంప్రదాయంలో భాగమే. కొందరు రోజంతా నిరాహార దీక్ష పాటిస్తే, మరికొందరు పండ్లు, పాలు మాత్రమే తీసుకుంటారు. సాయంత్రం శివాలయ దర్శనం అనంతరం ఉపవాస విరమణ చేస్తారు. ఉపవాసం ద్వారా శరీర శుద్ధితో పాటు మనస్సు ఏకాగ్రత పెరుగుతుందని ఆధ్యాత్మిక వేత్తలు పేర్కొంటున్నారు. ఇది ఆరోగ్యపరంగానూ కొంత మేలు చేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.శ్రావణ మాసంలో ప్రకృతి సోయగాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. వర్షాకాలంలో పచ్చని వాతావరణం, ఆలయాల ఆధ్యాత్మిక శోభ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. అనేక గ్రామాల్లో శివకళ్యాణాలు, భజన కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. సమాజంలో ఐక్యత, సేవాభావం పెంపొందించడంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రస్తుతం అనేక దేవాలయాలు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నాయి. ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించడం, పర్యావరణహిత పూజా సామగ్రిని ఉపయోగించాలని భక్తులకు సూచిస్తున్నారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, వృక్షారోపణ కార్యక్రమాలు నిర్వహించడం వంటి చర్యలు చేపడుతున్నారు. భక్తులు కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆలయ కమిటీలు పిలుపునిస్తున్నాయి.

తొలి శ్రావణ సోమవారం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు, దేవాదాయ శాఖ అధికారులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ప్రధాన ఆలయాల్లో అదనపు సిబ్బందిని నియమించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. అత్యవసర వైద్య సేవలు, తాగునీటి సదుపాయం, రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. భక్తులు సహనంతో వ్యవహరించి అధికారులకు సహకరించాలని సూచిస్తున్నారు. శ్రావణ సోమవారం అనేది కేవలం ఒక ఆధ్యాత్మిక ఆచారం మాత్రమే కాదు, భక్తి, క్రమశిక్షణ, సేవాభావం, కుటుంబ బంధాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన సందర్భం. ఈ రోజున శివారాధన చేయడం ద్వారా ఆత్మవిశ్వాసం, మానసిక ప్రశాంతత, సానుకూల దృక్పథం పెరుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. భక్తిశ్రద్ధలతో జరిగే ఈ పూజలు భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని భావితరాలకు చేరవేసే గొప్ప వారసత్వంగా నిలుస్తున్నాయి.

# స్నేహమేరా జీవితం

**ఈ లోకంలో స్నేహానికి సాటి బంధం లేదయ్యా,**
**స్వార్థపు నీడ తాకని పవిత్ర గంగ అదేనయ్యా!**
**సిరులు చెదిరిపోవచ్చు... హోదాలు మారిపోవచ్చు,**
**కాలగమనంలో మనుషులే దూరమైపోవచ్చు.**
**కానీ హృదయంలో చెక్కిన స్నేహపు చిరునామా,**
**కాలం చెరపలేని శాశ్వత కావ్యమవుతుంది.**
**కాడికట్టే కాలేవరకు కన్నీటి బొట్టు రాలేవరకు**
**కడదాకా తోడైఉంటుంది స్నేహం.**



"ఈ లోకంలో స్నేహానికి మించిన బంధం మరొకటి ఉందా?" అని ప్రశ్నిస్తే, సమాధానం ఒక్కటే లేదు. ఎందుకంటే స్నేహం అనేది రక్తంతో ఏర్పడే బంధం కాదు, హృదయాలతో అల్లుకునే అనుబంధం. జన్మతో వచ్చే బంధాలు మనకు దేవుడిచ్చిన వరమైతే, మనసుకు నచ్చిన వ్యక్తిని జీవితాంతం మనవాడిగా చేసుకునే అవకాశం స్నేహం ఇచ్చిన మహావరం. మనల్ని పలకరించే బంధువులు ఎందరో ఉంటారు. కానీ మనసును అర్థం చేసుకునే మిత్రుడు మాత్రం అరుదు. కష్టం వచ్చినా, నష్టం జరిగినా, మనసులోని మాటను ముందుగా పంచుకునేది స్నేహితుడితోనే. కొన్ని బాధలను, కొన్ని భావాలను అమ్మానాన్నలతో కూడా చెప్పలేకపోవచ్చు. కానీ అదే విషయాలను ఎలాంటి సంకోచం లేకుండా స్నేహితుడితో పంచుకోగలం. అదే నిజమైన స్నేహం గొప్పతనం.

స్నేహం గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే భారతరత్న 'డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం' గారు ఒక అద్భుతమైన మాట చెప్పారు.

"ఒక మంచి పుస్తకం వందమంది మిత్రులతో సమానం... కానీ ఒక మంచి స్నేహితుడు ఒక గ్రంథాలయంతో సమానం."

ఈ ఒక్క వాక్యంలోనే స్నేహం విలువ మొత్తం నిక్షిప్తమై ఉంది. పుస్తకం జ్ఞానాన్ని ఇస్తుంది. కానీ స్నేహితుడు జ్ఞానంతో పాటు ధైర్యాన్ని, దారిని, నమ్మకాన్ని, భరోసాను ఇస్తాడు. మన విజయాన్ని చూసి మనకంటే ఎక్కువ ఆనందపడే వ్యక్తి స్నేహితుడు. మన ఓటమిని చూసి మనకంటే ఎక్కువ బాధపడే వ్యక్తి కూడా స్నేహితుడే.

అందుకే స్నేహం చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. కానీ ఒకసారి నిజమైన స్నేహం చేశాక మాత్రం ఆ స్నేహాన్ని జీవితాంతం నిలబెట్టుకోవాలి. ఎందుకంటే సంపద తగ్గిపోవచ్చు, హోదా మారిపోవచ్చు, కాలం మనల్ని వేర్వేరు దారుల్లో నడిపించవచ్చు. కానీ నిజమైన స్నేహం మాత్రం కాలానికి అతీతంగా నిలిచిపోతుంది. మన జీవితంలో సంపాదించిన ఆస్తులు, పదవులు, పేరు, ప్రతిష్ఠ ఏవీ చివరి వరకు మన వెంట రావు. కానీ నిజమైన స్నేహితుడు మాత్రం చివరి క్షణం వరకు మనతోనే ఉంటాడు. మన ఆనందంలో చిరునవ్వు పంచుకుంటాడు. మన బాధలో కన్నీటి బిందువవుతాడు. చివరి ప్రయాణంలో కూడా భుజం అందించి, కన్నీటి వీడ్కోలు పలికేది నిజమైన స్నేహితుడే. అందుకే పెద్దలు "స్నేహం రక్తసంబంధాన్ని మించిన ఆత్మబంధం" అని చెప్పడం యథార్థం. అయితే ఒకప్పుడు స్నేహం వేరు... ఇప్పుడు స్నేహం వేరు అని చాలామంది అంటుంటారు. నిజానికి కాలం మారలేదు; మారింది మన జీవనశైలి. సాంకేతికత మన జీవితాన్ని వేగవంతం చేసింది. కానీ అదే వేగంలో మనుషుల మధ్య ఉన్న ఆత్మీయతను కొంత దూరం చేసింది. ఒకప్పుడు వేసవి సెలవులు వచ్చాయంటే స్నేహితులతో కలిసి చెట్ల నీడలో కబుర్లు చెప్పుకోవడం, కాలువల్లో ఈత కొట్టడం, మైదానాల్లో ఆటలు ఆడడం, సాయంత్రం వరకు నవ్వులతో గడపడం జీవితంలో మరచిపోలేని అనుభూతి. అరుగుల మీద కూర్చొని చెప్పుకున్న కబుర్లు, చిన్న చిన్న అలకలు, పెద్ద పెద్ద కలలు---అవే నిజమైన ఆనందాలు.

కానీ నేడు ఆ దృశ్యాలు అరుదుగా కనిపిస్తున్నాయి. ఒకే ఇంట్లో ఉన్నా, ఒకే వీధిలో ఉన్నా, ఒకరినొకరు చూసే కంటే మొబైల్ స్క్రీన్‌లనే ఎక్కువగా చూస్తున్నాం. ఆటల స్థానంలో ఆన్‌లైన్ గేమ్స్ వచ్చాయి. కబుర్ల స్థానంలో సోషల్ మీడియా సందేశాలు వచ్చాయి. పలకరింపుల స్థానంలో ఎమోజీలు వచ్చాయి. ఫలితంగా దూరంగా ఉన్నవారు దగ్గరైనట్లు కనిపిస్తున్నా, దగ్గరగా ఉన్నవారు మనసుకు దూరమవుతున్నారు. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వంటి సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్నా, స్నేహితులతో మనస్ఫూర్తిగా మాట్లాడుకునే సమయాన్ని మాత్రం కేటాయించలేకపోతున్నాం. ఏడాదికి ఒక్కసారైనా "ఎలా ఉన్నావు?" అని అడిగే ఆప్యాయత కూడా తగ్గిపోతోంది. ఒకప్పుడు ఒకే బెంచ్‌పై కూర్చొని చదివిన వారిలో ఎవరు ఎక్కడ ఉన్నారు? ఏ ఉద్యోగంలో స్థిరపడ్డారు? ఎలా జీవిస్తున్నారు? అనే విషయాలు కూడా చాలామందికి తెలియని పరిస్థితి ఏర్పడింది.



కోట దామోదర్
వ్యాసకర్త,
సెల్ : 9391480475

అందుకే జీవితంలో ఒక దశకు చేరుకున్న తర్వాత పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలు మనసును మళ్లీ బాల్యానికి తీసుకెళ్తాయి. ఆ పాత స్నేహితులను మరోసారి కలవాలని, నవ్వులను పంచుకోవాలని, జ్ఞాపకాలను నెమరువేసుకోవాలని ప్రతి హృదయం కోరుకుంటుంది. ఆ కోరికకు రూపమే "పూర్వ విద్యార్థుల సమ్మేళనం."

పూర్వ విద్యార్థుల సమ్మేళనం అనేది కేవలం ఒక సమావేశం కాదు. అది కాలాన్ని వెనక్కి తిప్పే క్షణం. అది జ్ఞాపకాల జలపాతం. అది నవ్వుల నందనం. అది స్నేహానికి పునర్జన్మ. అది మరచిపోయిన మనుషులను మళ్లీ మనసుకు దగ్గర చేసే ఆత్మీయ వేదిక.అందుకే జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంత సంపద సంపాదించినా, ఎంత హోదా సాధించినా--- స్నేహితులను మాత్రం మరచిపోకూడదు. ఎందుకంటే ధనం జీవితం సాగిస్తుంది; కానీ స్నేహం జీవితానికి అర్థం చెబుతుంది.

# జైషే కుట్రలో హమీమ్ అరెస్ట్

కోల్‌కతా, ఆగస్టు 2 : పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ ఉగ్రసంస్థతో సంబంధాలు ఉన్న హమీమ్ మోండల్‌ను, అతనికి సహకరించిన జార్ఖండ్‌కు చెందిన యువతి అర్పిత సర్కార్‌ను పశ్చిమ బెంగాల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు పలు కీలక విషయాలను వెల్లడించారు. దేశంలో అల్లర్లు సృష్టించడం, రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకోవడం వంటి కుట్రలకు సంబంధించి నిందితుల పాత్రపై లోతుగా విచారణ కొనసాగుతోంది. దర్యాప్తులో భాగంగా ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో అల్లర్లు సృష్టించేందుకు హమీమ్‌కు జైషే మహ్మద్ హ్యాండ్లర్ల నుంచి ఆదేశాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. పోలీసు యూనిఫామ్ ధరించి నిరసన ప్రదేశంలోకి ప్రవేశించాలని, అందుకోసం మహిళలు, పురుషులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించినట్లు వెల్లడించారు. నిందితులు నిజంగా ఢిల్లీకి వెళ్లారా లేదా అనే అంశంపై వారి డిజిటల్ కమ్యూనికేషన్‌ను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.పశ్చిమ బెంగాల్‌లోని ప్రముఖ రాజకీయ నాయకుల కదలికలపై సమాచారం సేకరించాలని కూడా హ్యాండ్లర్లు హమీమ్‌ను ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా ప్రతిపక్ష నేత సువేంధు అధికారికి భద్రత తక్కువగా ఉండే ప్రాంతాల వివరాలు తెలుసుకోవాలని సూచించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కుట్ర వెనుక మరింత పెద్ద నెట్‌వర్క్ ఉండే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని దర్యాప్తు విస్తరించారు. నాలుగేళ్ల క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా హమీమ్‌కు పరిచయమైన జార్ఖండ్ యువతి అర్పిత సర్కార్ అతనికి కీలకంగా సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. చిన్నస్థాయి రాజకీయ నాయకులతో పరిచయాలు పెంచుకుని, వారి ద్వారా ప్రముఖ నేతల వివరాలు సేకరించడం, తమ అనుచరులను రాజకీయ పార్టీల్లో కార్యకర్తలుగా చేర్పించడం వంటి పనుల్లో ఆమె పాత్ర ఉన్నట్లు అధికారులు తెలిపారు. బెంగాల్‌కు చెందిన ఓ మంత్రి కుమారుడిని హనీట్రాప్ ద్వారా కిడ్నాప్ చేసి డబ్బు వసూలు చేయాలనే కుట్ర కూడా వీరిద్దరూ పన్నినట్లు వెల్లడించారు.



అర్పిత సర్కార్‌కు పలువురు రాజకీయ నాయకులతో పరిచయాలు ఉన్నాయని, వారి వ్యక్తిగత, రాజకీయ సమాచారం హమీమ్‌కు చేరవేసినట్లు దర్యాప్తులో తేలిందని అధికారులు పేర్కొన్నారు. దేశంలో తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడం, యువతను ఉగ్రవాద సంస్థల్లో చేర్చేందుకు అవసరమైన నెట్‌వర్క్ ఏర్పాటులో ఈ ఇద్దరూ పనిచేసినట్లు అనుమానిస్తున్నారు. నిందితులు పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లతో ఎన్‌క్రిప్టెడ్ సందేశాల యాప్‌ల ద్వారా కొన్నేళ్లుగా సంబంధాలు కొనసాగించినట్లు దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. వారి వద్ద యునైటెడ్ కింగ్‌డమ్, మెక్సికోకు చెందిన అంతర్జాతీయ సిమ్‌కార్డులు కూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో మరికొందరి పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని, దేశ భద్రతకు ముప్పు కలిగించే అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు స్పష్టం చేశారు.

# సకాలంలో పన్నుల్లో వాటా... అభివృద్ధికి ఊతం

## అదనపు పన్నుల వాటా కేటాయింపుపై ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు

**అమరావతి, కర్తవ్య దర్శి ప్రతినిధి** అదనపు పన్నుల వాటా కేటాయింపుపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన విడుదలయ్యే పన్నుల వాటాతో పాటు అదనంగా రూ.4,597 కోట్ల పన్నుల వాటాను కేటాయించినందుకు ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ఎక్స్ వేదికగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం చేసిన పన్నుల వాటా కేటాయింపుతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత బలం చేకూరుస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల తరపున ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. అదనపు పన్నుల వాటా విడుదలతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత వేగవంతం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి నిరంతరం అందిస్తున్న సహకారం రాష్ట్ర పురోగతికి ఎంతో దోహదపడుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ముదిగుబ్బ సమీప కొండల్లో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ట్రెక్కింగ్

## పాల్గొన్న వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, నాయకులు

ముదిగుబ్బ, : ముదిగుబ్బ మండలానికి సమీపంలో డి చెర్లోపల్లి గ్రామ వద్దగల కొండను ధర్మవరం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ట్రెక్కింగ్ చేశారు.





అప్పుడప్పుడు కొండలను ఎక్కడం తన అలవాటు అని, ఇలా ఎక్కడం ద్వారా ప్రకృతిని నేరుగా ఆస్వాదించే అవకాశం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ట్రెక్కింగ్ సమయంలో ముదిగుబ్బ మండలానికి చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం మండలానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలతో కాసేపు ముచ్చటించి, పార్టీ బలోపేతం, మరియు వివిధ కార్యక్రమాలపై చర్చించారు.

# ముదిగుబ్బ కేజీబివిలో రాష్ట్ర జీసిడిఓ అధికారిణి ఆకస్మిక తనిఖీ

ముదిగుబ్బ, :ముదిగుబ్బ మండల కేంద్రంలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్ ను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గర్ల్స్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ సుధాలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్లోని విద్యార్థినిలకు అందుతున్న వసతులు మరియు విద్యా బోధన నాణ్యతలపై ఆరా తీశారు. అలాగే విద్యార్థినిల కోసం ఏర్పాటు చేసిన మధ్యాహ్నం భోజనం రుచి చూసి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. తర్వాత విద్యార్థినులతో మాట్లాడుతూ, పదవ తరగతి మరియు ఇంటర్మీ డియట్ విద్యార్థినిలు శ్రద్ధ మరియు క్రమశిక్షణతో చదువు సాగించి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.

# కడప నగర అభివృద్ధికి రూ.804 కోట్లతో సమగ్ర రూపకల్పన

కడప, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా రూ.804 కోట్లతో కడప నగర రూపురేఖలు మారనున్నాయని, ప్రతి రూపాయి ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూర్చేలా అభివృద్ధి పనులు చేపట్టాలని కడప నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ డా. చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కడప నగరపాలక సంస్థ బోర్డు మీటింగ్ హాలులో ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ డా. చెరుకూరి శ్రీధర్ అధ్యక్షతన కేఎంసీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నగర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను సమీక్షించి ఆమోదం తెలుపడంతో పాటు, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.కడప నగరాన్ని ఆధునిక మౌలిక సదుపాయాలతో రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దే దిశగా నగరపాలక సంస్థ కీలక అడుగు వేసిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. మొత్తం రూ.804.62 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు కడప నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమోదం లభించడం జరిగిందన్నారు.నగరంలో తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, సీసీ రహదారులు, డ్రైనేజీ, చెరువుల పునరుద్ధరణ, పారిశుద్ధ్యం, టౌన్ ప్లానింగ్, పన్నుల వసూళ్లు, పచ్చదనం, ప్రజా భద్రత వంటి ప్రతి అంశంలో నాణ్యతతో కూడిన అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రూ.804.62 కోట్లతో నగర సమగ్ర అభివృద్ధి కోసం ప్రతిపాదించి ఆమోదం పొందిన అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు.

# భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతం కావడంపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి హర్షం

## సీఎం చంద్రబాబు విజన్ తోనే భోగాపురం ఎయిర్పోర్ట్ సాకారం

## అడ్డుకున్నవారే క్రెడిట్ కోసం పాకులాడుతున్నారు

## భోగాపురంతో మారనున్న ఉత్తరాంధ్ర దశ – దిశ




**రాజమండ్రి** . భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతం కావడంపై పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో తాను భాగస్వామి అయి పాలుపంచుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా తరలివచ్చి, కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించిన ఉత్తరాంధ్ర ప్రజలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం మరియు కమిటీ సభ్యుల సమన్వయ కృషి వల్లే ఈ కార్యక్రమం ఇంతటి ఘన విజయాన్ని సాధించిందని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా భోగాపురం ఎయిర్పోర్ట్ క్రెడిట్ తమదేనంటూ వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై మంత్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భోగాపురం ఎయిర్పోర్ట్‌కు నాంది పలికింది, పూర్తి చేసింది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడేనని ఆయన స్పష్టం చేశారు. నాడు కనీసం ఎర్ర బస్సు కూడా రాని ప్రాంతానికి ఈరోజు అంతర్జాతీయ స్థాయి ఎయిర్పోర్ట్‌ను తీసుకువచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని గర్వంగా చెప్పగలమన్నారు. గతంలో భోగాపురం ఎయిర్పోర్ట్ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ఎన్నో కుట్రలు పన్నిన వారు, నేడు దాని క్రెడిట్ కోసం పాకులాడటం సిగ్గుచేటన్నారు. క్రెడిట్ కోసం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పడుతున్న తాపత్రయం, ట్విట్టర్ వేదికగా చేస్తున్న వ్యాఖ్యలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి, నిరంతర పర్యవేక్షణ వల్లే ఈ బృహత్తర ప్రాజెక్టు సకాలంలో సాకారమైందని తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో ఉత్తరాంధ్ర ప్రాంతం పారిశ్రామికంగా, పర్యాటకంగా సరికొత్త దూకుడు కనబరుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర ప్రజల దశ–దిశను మార్చబోతోందని అన్నారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శంషాబాద్ ఎయిర్పోర్ట్ నిర్మించినా, నేడు నవ్యాంధ్రలో భోగాపురం ఎయిర్పోర్ట్ నిర్మించినా.. అది కేవలం చంద్రబాబు నాయుడి విజన్ వల్లే సాధ్యమైందని కొనియాడారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మండిపడ్డారు.

# పులుల సంరక్షణ, నిర్వహణ చర్యలపై అధ్యయనానికి హైపవర్డ్ కమిటీ

## ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఐదుగురు సభ్యులతో నియామకం

## నల్లమలలో అనుమానాస్పద స్థితిలో పులి మరణంపై పవన్ కళ్యాణ్ సీరియస్

## పులులు, వన్యప్రాణుల సంరక్షణ చర్యలపై సమగ్ర నివేదికకు ఆదేశం

విజయవాడ ;: పులులే అడవులకు ప్రాణం... అడవులే ప్రకృతి సమతుల్యతకు ఆధారం. పులుల సంరక్షణలో ఎలాంటి రాజీ ఉండదన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణ శాఖల మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆదేశాల మేరకు దేశంలోనే అతిపెద్ద పులుల ఆవాసాలలో ఒకటైన నాగార్జునసాగర్--శ్రీశైలం టైగర్ రిజర్వ్ (చీూ=)లో పులుల సంరక్షణ వ్యవస్థను సమగ్రంగా సమీక్షించి, భవిష్యత్తు కార్యాచరణకు మార్గదర్శకాలను రూపొందించేందుకు హైపవర్డ్ కమిటీని ఏర్పాటు చేసింది. దేశంలోనే అతిపెద్ద పులుల ఆవాసాలలో ఒకటిగా గుర్తింపు పొందిన నాగార్జునసాగర్--శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో రెండు రోజుల క్రితం ఆడ పులి అనుమానాస్పద మృతి ఘటనను శ్రీ పవన్ కళ్యాణ్ గారు తీవ్రంగా పరిగణించారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలన, పులులు, వాటి ఆవాసాల సమర్థవంతమైన సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యల ఆవశ్యకతను గుర్తించారు. పులులతోపాటు వన్యప్రాణుల సంరక్షణ చర్యలు, హనుమాన్ కార్యకలాపాలు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం చేపట్టేందుకు వీలుగా ఈ హైపవర్డ్ కమిటీకి సిఫారసు చేశారు.

రాష్ట్ర అటవీశాఖ సలహాదారు శ్రీ పి. మల్లికార్జునరావు, అడిషనల్ పీసీసీఎఫ్ శ్రీ రాహుల్ పాండే కమిటీలో శాఖాపరమైన సభ్యులుగా వ్యవహరించనున్నారు. అలాగే వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (ఔఔఖీ) సభ్యుడు శ్రీ బి. రాజశేఖర్, హైదరాబాద్ కన్జర్వేషన్ ఫర్ టైగర్ సొసైటీ ప్రతినిధి శ్రీ ఇమ్రాన్ సిద్ధిఖీ, ప్రముఖ వన్యప్రాణి శాస్త్రవేత్త డాక్టర్ ఎం. నవీన్ కుమార్ కమిటీలో సభ్యులుగా సేవలందించనున్నారు. హైపవర్డ్ కమిటీకి క్షేత్రస్థాయిలో సహకారం అందించడంతోపాటు సమన్వయ బాధ్యతలను విధుల్లో ఉన్న సీసీఎఫ్ అధికారి నిర్వహించనున్నారు.పులుల జనాభా, ఆవాసాలకు ఎదురవుతున్న ముప్పులను గుర్తిస్తూ సమగ్ర అంచనా నివేదిక రూపొందించడం, నివారణకు తగిన వ్యూహాలకు రూపకల్పన చేయాలని హైపవర్డ్ కమిటీ సభ్యులకు శ్రీ పవన్ కళ్యాణ్ గారు దిశగా నిర్దేశం చేశారు. ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలు, సంస్థాగత సంస్కరణలు, సిబ్బంది సామర్థ్యాల పెంపు, మౌలిక సదుపాయాల బలోపేతం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం తదితర అంశాలపై సమగ్రమైన సిఫారసులు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రివర్యులు సూచించారు. క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారులు, ఇతర భాగస్వామ్య వర్గాలతో సమావేశాలు నిర్వహించి, శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను పరిశీలించి వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. పులుల సంరక్షణ, అడవుల పరిరక్షణ, జీవవైవిధ్య రక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. హైపవర్డ్ కమిటీ సిఫారసులు నాగార్జునసాగర్--శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో తీసుకుంటున్న సంరక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

# తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు ప్రారంభం

## విజయవాడలో కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మాత్యులు శ్రీ నాదెండ్ల మనోహర్

## రాష్ట్రవ్యాప్తంగా 130 రైతు బజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మకాలు

## భవిష్యత్తులో కందిపప్పు, పామాయిల్ కూడా తక్కువ ధరకే అందించే ఏర్పాట్లు

## ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరిన మంత్రివర్యులు శ్రీ మనోహర్

విజయవాడ తక్కువ ధరకే బియ్యం అమ్మకాల కేంద్రాలు రాష్ట్ వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఆదివారం ప్రారంభం అయ్యాయి. బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరలకే బియ్యం అందించి సామాన్యుడికి అండగా నిలవాలన్న కూటమి ప్రభుత్వం ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలోని 130 రైతు బజార్లు, 500 రైస్ మిల్లుల ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం అమ్మకాలను ఆదివారం ఉదయం నుంచి ప్రారంభించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం సహకారంతో ఈ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కేజీ రూ. 52కు, బీపీటీ రా రైస్ కేజీ రూ. 50 లకు ప్రత్యేక కౌంటర్లలో ప్రజలకు విక్రయిస్తున్నారు. ఆధార్ కార్డు ఆధారంగా చేసుకొని ప్రతి మనిషికి 10 కేజీల బియ్యం చొప్పున కౌంటర్లలో అందజేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవాడలోని ఏపీఐఐసీ రైతు బజార్ లో రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మాత్యులు శ్రీ నాదెండ్ల మనోహర్ గారు ఆదివారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. ప్రజలకు తక్కువ ధరకే స్వయంగా బియ్యాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా మీడియాతో శ్రీ నాదెండ్ల మనోహర్ గారు మాట్లాడుతూ.. “బహిరంగ మార్కెట్లో బియ్యం ధరల్లో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనించి, సమీక్ష చేసి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ప్రజలకు అందుబాటులో ప్రత్యేకంగా తక్కువ ధరకు బియ్యం అమ్మాలని నిర్ణయించాం. దీనిలో భాగంగా రాష్ట్ర రైస్ మిల్లర్లతో చేసిన చర్చల్లో భాగంగా తక్కువ ధరకే బియ్యాన్ని రాష్ట్ర ప్రజలకు అందుబాటులో ఉంచాలని నిర్ణయించాం. దీనికి రైస్ మిల్లర్లు కూడా సహకరిస్తామని ముందుకు రావడం అభినందనీయం. బహిరంగ మార్కెట్లో రూ. 65 నుంచి రూ. 62 లకు లభ్యమవుతున్న బిపిటి సూపర్ ఫైన్ రకం బియ్యం ప్రత్యేక కౌంటర్లలో రూ. 52కు, బహిరంగ మార్కెట్లో రూ.58 రూపాయల నుంచి రూ.60 ధరకు దొరుకుతున్న బియ్యాన్ని రూ. 50 కు అందించాలని నిర్ణయం తీసుకున్నాం. నేటి నుంచి అన్ని కౌంటర్లలో బియ్యం ప్రజలకు అందుబాటులో ఉంటాయి. భవిష్యత్తులో కందిపప్పు, పామాయిల్ కూడా తక్కువ ధరలకు అందించేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నాం. ప్రజలకు కష్టం రాకమునుపే అర్థం చేసుకుని దానికి అనుగుణంగా చర్యలు తీసుకునే ప్రభుత్వం మాది. ఈ తక్కువ ధరలకే బియ్యం కేంద్రాలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి” అన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే శ్రీ గద్దె రామ్మోహన రావు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్రీమతి నూపుర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ శ్రీ లక్ష్మీశ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు, జనసేన రాష్ట్ర కార్యదర్శి శ్రీ అమ్మిశెట్టి వాసు పాల్గొన్నారు.





ప్రజా ముద్ర

# నేటి నుంచి ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రం ప్రారంభం

తాడిపత్రి, :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకు అందుబాటులో ఉంచే లక్ష్యంతో తాడిపత్రి పట్టణంలో సోమవారం నుంచి ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ రవిచంద్ర, సీఎస్‌డీటీ మల్లేష్ ప్రసాద్ తెలిపారు.తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి. అశ్మిత్ రెడ్డి ప్రత్యేక చొరవతో, మాజీ ఎమ్మెల్యే జె.సి. ప్రభాకర్ రెడ్డి సహకారంతో, తాడిపత్రి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భాగస్వామ్యంతో పట్టణంలోని పాత తేరు, మెయిన్ బజార్‌లో ఈ ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.తాడిపత్రి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాలకు చెందిన అర్హులైన రేషన్ కార్డుదారులు తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డు చూపించి ప్రతి రేషన్ కార్డుపై కనిష్ఠంగా 10 కిలోల నుంచి గరిష్ఠంగా 25 కిలోల వరకు అవసరాన్ని బట్టి సాధారణ బియ్యం లేదా స్టీమ్ బియ్యం కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు.ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం సాధారణ బియ్యాన్ని కిలోకు రూ.50, స్టీమ్ బియ్యాన్ని కిలోకు రూ.52 చొప్పున విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం అందుబాటులో ఉండటంతో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# ప్రమాదవశాత్తు స్కూల్ బస్సు దగ్ధం



తాడిపత్రి: పట్టణ సమీపంలోని పుట్లూరు గేటు వద్ద ఉన్న గురుకులం పాఠశాల కు సంబంధించి స్కూలు బస్సు పాత బస్సు ఆదివారం ప్రమాదవశాత్తు అంటుకొని కాలిపోయింది. వెంటనే ఫైర్ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి బస్సులను ఆర్పి వేశారు. కాలం చెల్లిన బస్సు ప్రక్కన నిలబెట్టిన వాటిని ప్రమాదవశాత్తు అంటుకొని స్క్రాప్ బస్సు దగ్ధమైందని ఫైర్ ఆఫీసర్ మోహన్ బాబు తెలిపారు

# బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ ని ఘనంగా సన్మానించిన గోరంట్ల జనసేన నాయకులు

గోరంట్ల: కదిరి మెయిన్ రోడ్డు లోని ఎముకల గుట్ట పల్లి మీదుగా



కొలింపల్లి గ్రామం వరకు 9 గ్రామాల మీదుగా సుమారు 11 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.4.47 కోట్ల వ్యయంతో భూమిపూజ కార్యక్రమం కి విచ్చేసిన మంత్రి సవితమ్మ ని కలసి ఘనంగా సన్మానం చేశారు, ఈ కార్యక్రమం లో జనసేన ఉమ్మడి అనంతపూర్ జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్, ఉమ్మడి అనంతపురం జిల్లా సంయుక్త కార్యదర్శి సి వెంకటేష్. జిల్లా కార్యక్రమాల కమిటీ సభ్యుడు పి వెంకటేష్. గోరంట్ల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నరేష్.వానువోలు సింగల్ విండో డైరెక్టర్ నాగేష్. వీర మహిళ కావేరి. మండల్ నాయకులు శ్రీనివాసులు. గాజుల రమేష్. శివ. తిరుపాల్. సాయి. నాగభూషణ. తదితరులు పాల్గొన్నారు.

# శాకాంబరీ అలంకరణలో దర్శనం ఇచ్చిన శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవి

గోరంట్ల,:పట్టణం లోని పులేరు రోడ్డులోని నాగుల బావి వద్ద గల శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆదివారం శాకాంబరీ అలంకరణలో దర్శనం ఇచ్చారు, అమ్మవారికి నిర్వహించే పూజా కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటలకు ఆషాఢ మాసం సందర్భముగా అమ్మ వారిని వివిధ రకాల కూరగాయలు,ఆకుకూరలు మరియు ఫలాలతో అలంకరించే పవిత్రమైన శాకాంబరీ అలంకరణతో అమ్మవారికి విశేష పూజా కార్యక్రమం ను పురో హితులు నాగేంద్ర ప్రసాద్ శర్మ నిర్వ హించారు, పూజా కార్యక్రమానికి హాజరయ్యి శాకాంబరీ అలంకరణలో ఉండే మన రేణుకా ఎల్లమ్మ దేవిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా స్థల దాతలు నాగవేణి ఉ గంగాధర గౌడ్ మరియు వీరి కుమారుడు రెడ్డి హేమంత్ గౌడ్, వీరి కుమార్తె రెడ్డి ఉషశ్రీ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# రేణిగుంటలో "ఆద్య వైన్స్" వద్ద ఐద్వా ధర్నా

## "రౌండ్ టేబుల్ సమావేశం" లో మద్యం షాపులు తొలగించాలని.. ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ తీర్మానం

రేణిగుంట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆద్య వైన్స్, సర్వేశ్ వైన్స్ మద్యం షాపులను తక్షణమే తొలగించాలని ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం పంచాయతీ కార్యాలయం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు.ఈ సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాయి లక్ష్మి మాట్లాడుతూ, నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాల నిర్వహణ వల్ల మహిళలు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి జోక్యం చేసుకుని వెంటనే ఈ షాపులను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
సమావేశం అనంతరం ప్రజా సంఘాల నాయకులు, మహిళలు పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి ఆద్య వైన్స్ దుకాణం ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. మద్యం షాపులను తొలగించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి నిరవధిక నిరాహార దీక్షలు సహా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడతామని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, మండల అధ్యక్షురాలు బి. భారతి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ సాయి లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు సత్యశ్రీ, వేణుగోపాలపురం కార్యదర్శి అమ్ములు, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు మల్లేశ్వరి, ఆటో యూనియన్ నాయకులు దీపా, హేమనాథ్, బిల్డింగ్ యూనియన్ కార్యదర్శి రాజశేఖర్, టిడిపి మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, రేవతి, రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు పద్మావతి, సంఘమిత్ర యూనియన్ మనీలా, ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టేటి ప్రసాద్, గిరిజన ఉద్యోగ సంఘం కార్యదర్శి రమణ, గిరిజన సంఘం నాయకురాలు సులోచన, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరమణ, సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కె. హరినాథ్, స్థానిక మహిళలు పద్మమ్మ, లత, కస్తూరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




# ముఖ్యమంత్రి గారు మహాలక్ష్మి పథకం ఎప్పుడు అమలు చేస్తారు

## మహిళలకు ఇచ్చినటువంటి హామీలు అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతాం.

## డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షుల ముడియం చిన్ని.

**బద్వేల్.ఆగష్టు. 2** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఊరు వాడ తిరుగుతూ మహిళలకు అనేక హామీలు ఇచ్చారని తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఇస్తామన్నా మహాలక్ష్మి పథకం ఇంతవరకు ఇచ్చినటువంటి పాపాన పోలేదన్నారు ఇప్పటికైనా ముఖ్యమంత్రి గారు సూపర్ సిక్స్ భాగమైనటువంటి మహాలక్ష్మి పథకం ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆదివారం డివైఎఫ్ఐ మహిళా కన్వినింగ్ కమిటీ సమావేశం సుందరయ్య కాలనీలో నిర్వహించడం జరిగింది . ఈ సమావేశానికి పట్టణ అధ్యక్షుడు ఎస్కే మస్తాన్ షరీఫ్ అధ్యక్షత వహించడం జరిగింది . ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... కూటమి ప్రభుత్వం మహిళలకు 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతినెల 1500 రూపాయలు నగదు చెల్లిస్తానని లోకేష్ బాబు పాదయాత్ర సందర్భంగా కనిపించినటువంటి ప్రతి మహిళకు హామీ ఇవ్వడం జరిగింది . అయితే సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని కూటమి ప్రభుత్వం హంగుహార్భాటాలు చేసుకోవడం తప్ప చేసింది ఏమీ లేదని వారన్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పైబడి అవుతున్న ఒక్క మహిళ ఖాతాలో ఒక్క రూపాయి వేసిన పాపాన పోలేదన్నారు ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆలోచించి ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని అమలు చేయని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మహిళలను కలుపుకొని పెద్ద ఎత్తున సూపర్ సిక్స్ పథకాలు అమలయింతవరకు పోరాటాలు కొనసాగిస్తామని వారు హెచ్చరించారు ఈ సమావేశంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్ ఎస్ కే ఆదిల్ మహిళలు షేక్ ఫాతిమా నాగేశ్వరి అరుణ మాధవి లత పీరమ్మ నాగరత్నమ్మ కృష్ణవేణి గౌసియా రిజ్వానా ఆయేషా వెంకటమ్మ పద్మ లక్ష్మీదేవి ఖాదర్ బి తదితరులు పాల్గొన్నారు.




# రచయిత రామ్మోహన్ కు ఘన సన్మానం

బద్వేలు, ఆగస్టు 2: జాతీయస్థాయిలో ప్రముఖ రచయితగా గుర్తింపు పొంది, "జాతీయ విశేష ప్రతిభా వాగ్దేవి పురస్కారం" ను అందుకున్న ఉపాధ్యాయుడు బొల్లు రామ్మోహన్ అభినందనీయుడని ఎంఈఓ ఏ.కొండిశెట్టి,ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎఫ్ఇటిఓ)జాతీయ కార్యదర్శి పి.రమణారెడ్డి, శ్రీకృష్ణదేవరాయ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎమ్రమేష్ బాబు పేర్కొన్నారు. ఇటీవల న్యూఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమలు మరియు ఉక్కు గనుల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ మరియు పలువురు పార్లమెంటు సభ్యుల చేతుల మీదుగా "జాతీయ విశేష ప్రతిభా వాగ్దేవి పురస్కారం"ను పోరుమామిళ్ళకు చెందిన ఉపాధ్యాయుడు,ప్రముఖ రచయిత బొల్లు రామ్మోహన్ అందుకోవడమైనది.ఈ సందర్భంగా పోరుమామిళ్లలోని ఎస్టీయు భవన్ నందు రీజనల్ కన్వీనర్ వి.వి.క్రిష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అభినందన సన్మాన కార్యక్రమంలో కొండిశెట్టి, రమణారెడ్డి,రమేష్ బాబు మాట్లాడుతూ రామ్మోహన్ ఉపాధ్యాయుడిగా విద్యారంగానికి విశేష సేవలందిస్తూనే,రచయితగా సాహిత్యరంగంలో తనదైన శైలిలో ఎన్నో రచనలు,వ్యాసాలు రచించి సుమారు నూరు అవార్డులు ప్రశంసా పత్రాలు అందుకోవడంతోపాటు,రెండు వందలకు పైగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి సాహిత్య వేదికలలో పేరొందిన ప్రముఖ కవులు,రచయితల మన్ననలు పొంది, మాల్దీవుల ఉపరాష్ట్రపతి,పలు రాష్ట్రాల గవర్నర్లు,కేంద్ర మంత్రులు, రాష్ట్రమంత్రులు, ఉన్నతాధికారుల చేతులమీదుగా ప్రశంసలు అందుకోవడం జరిగిందన్నారు. అటువంటి వ్యక్తి ఉపాధ్యాయుడు కావడం,మన పోరుమామిళ్ల ప్రాంతం వాసి కావడం గర్వించదగ్గ అంశమన్నారు.వృత్తిపరంగా హిందీ ఉపాధ్యాయుడైనప్పటికీ తెలుగు భాషలో మంచి పట్టు సాధించి,రచనలు చేయడం మాతృభాషపై ఆయనకు గల ఆసక్తికి నిదర్శనమన్నారు. అదేవిధంగా సామాజిక సేవలో సైతం తన వంతు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.




పురస్కార గ్రహీత,రచయిత రామ్మోహన్ మాట్లాడుతూ,లి వృత్తిపరంగా తాను వృత్తిపరంగా హిందీ ఉపాధ్యాయుడనైనప్పటికీ మాతృభాష అయిన తెలుగు అంటే ఎనలేని అభిమానమన్నారు. మాతృభాషాభిమానిగా పలు రచనలు చేయడంతో పాటు, చరిత్రలో మరుగున పడిన పలు అంశాలను వెలికితీయడంలో తన వంతు కృషి చేస్తున్నానన్నారు. తదనంతరం రామ్మోహన్ ను ఎస్టీయు నాయకులు శాలువా, పూలమాల,మెమొంటోతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఎస్టీయు జిల్లా ఆర్థికకార్యదర్శి యు.సుబ్రమణ్యం,పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు సి.గురుమూర్తి, రాష్ట్ర కౌన్సిలర్లు వాకా చంద్రశేఖర్,ఓ.చంద్రహాసరెడ్డి, కె.పుల్లయ్య,జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖర్ బాబు, వెంకటరెడ్డి,గురయ్య,బాలరాజు, శ్రీనివాసులు,వెంకటసుబ్బయ్య,రాజగోపాల్ రెడ్డి, రీజనల్ కో కన్వీనర్ రమణ, ఆఫీస్ ఇంచార్జి కస్తూరి శ్రీనివాసులు,వివిధ మండలశాఖల ప్రధాన బాధ్యులు జయరామిరెడ్డి, శ్రీనివాసులు,సిద్ధారెడ్డి,అబ్దుల్ హుస్సేన్,ప్రదీప్,నాగసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# పంట బీమాతోనే రైతుకు ధీమా

## అరకు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు దేవకోట వెంకట్ నాయుడు

**జియ్యమ్మవలస ఆగస్టు 2**ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతన్నకు పంట బీమానే కొండంత అండ అని, గడువు ముగిసేలోగా రైతులందరూ తప్పనిసరిగా పంట బీమా నమోదు చేసుకోవాలని అరకు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ దేవకోట వెంకట్ నాయుడు కోరారు. కొమరాడ మండలం విక్రంపురం గ్రామ పంచాయతీలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అరకు పార్లమెంట్ పరిధిలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా వరి పంట వేసిన రైతులు తమ బీమా నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు ఆర్థికంగా బాగుండాలని, ఏ ఒక్క రైతు నష్టపోకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ బీమా పథకానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. పంట నష్టపోయినప్పుడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ఈ అవకాశాన్ని ప్రతీ రైతు



ఉపయోగించుకోవాలని తెలిపారు.రైతులు తమ పరిధిలోని గ్రామ సచివాలయాలు లేదా అగ్రికల్చర్ అసిస్టెంట్లను కలిసి క్రింది పత్రాలను సమర్పించాలని తెలిపారు, అలాగేఆధార్ కార్డు,పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్,1-బి,బ్యాంకు ఎకౌంటు జిరాక్స్,రైతులందరూ ఆఖరి తేదీ వరకు వేచి చూడకుండా, గడువు ముగిసేలోపే నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని దేవకోట వెంకట్ నాయుడు స్పష్టం చేశారు.

# సంక్షేమంతో పాటు అభివృద్ధే లక్ష్యం





## రూ.4.47 కోట్లతో 11 కి.మీ. రహదారికి భూమిపూజ చేసిన మంత్రి సవిత

### ఎన్నికల ప్రచారంలో మాటిచ్చా నిలబెట్టు కుంటున్న మంత్రి సవిత

అనంతపురం, :ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, రాష్ట్రంలోని ప్రతి మారుమూల గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సవిత తెలిపారు. ఈ సందర్భంగా పెనుకొండ నియోజకవర్గం లోని గోరంట్ల- కదిరి మెయిన్ రోడ్ నుండి కొలింపల్లి గ్రామం వరకు 9 గ్రామాల మీదుగా సుమారు 11 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ. 4.47 కోట్ల వ్యయంతో మంత్రి సవితమ్మ భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ సాస్కీ నిధులతో రూ. 20 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపడు తున్నామని పేర్కొన్నారు.



అలాగే గోరంట్ల మండలంలో సుమారు రూ. 13 కోట్ల వ్యయంతో పలు రహదారి నిర్మాణ పనులు కొనసాగు తున్నాయని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ (ఓ హెచ్ ఎస్ ఆర్) ట్యాంకుల నిర్మాణం కూడా చేపడుతున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, కూటమి ప్రభుత్వం మాత్రం సంక్షేమంతో పాటు సమగ్ర అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి సవిత అన్నారు. త్వరలో కొత్త పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు అర్హులందరికీ గృహాల కల్పన దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.గత ప్రభుత్వ హయాంలో తొమ్మిది సార్లు బస్సు ఛార్జీలు పెంచారని, అయితే కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.తాగునీటి సమస్యల పరిష్కారంతో పాటు సాగునీటి సౌకర్యాల మెరుగుదలకు చర్యలు తీసుకుంటు న్నామని, కాలువల మరమ్మతులు, ఇరిగేషన్ పనులను వేగవంతంగా చేపడుతున్నామని పేర్కొన్నారు. అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు.కూటమి నాయకులు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వివరించాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. అదే సమయంలో గత ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన పనులు, ప్రస్తుత ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి అభివృద్ధికి ప్రజలు మరోసారి మద్దతు ఇవ్వాలని మంత్రి సవిత కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి, హస్త కళల డైరెక్టర్ పులేరు సోమశేఖర్, కాంట్రాక్టర్ రమణా రెడ్డి, తహసిల్దార్ మధు నాయక్, ఎంపిడిఓ కమలా బాయి, ఆర్ డబ్ల్యూ ఎస్ మోహన్, ఏ పి ఓ నాగిరెడ్డి, కార్యదర్శి గురుస్వామి, జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు బోయ లక్ష్మీనారాయణ, బొట్టు శ్రీనివాసులు, జనసేన సంతోష్, సురేష్,మాజీ ఎంపీపీ నిమ్మల విద్య ధరణి, సిక్స్ మ్యాన్ కమిటీ సభ్యులు గిరిధర్ గౌడ్, నాగే నాయక్, షేక్ అజ్మతుల్లా, నిమ్మల శ్రీధర్, బీ రే వేణుగోపాల్ రాయల్, జయరామ్, డైరెక్టర్ దేవాంగం శ్రీనివాసులు, నబీ రసూల్, మాజీ సర్పంచ్ ఉత్తమ రెడ్డి, నరసింహులు,కట్టుబడి ఆంజనేయులు, ప్రసాద్,రెడ్డి చెరువు కట్ట కృష్ణ మూర్తి, నరేష్, కుమార్,నాగమణి,సోమశేఖర్, అచ్యుత్ చౌదరి, శుభహాన్, రోహిత్, కావేరి తో పాటు పలువురు అధికారులు ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# గ్రామీణ సంస్కృతి సాంప్రదాయాలను కొనసాగించాలి

### మాజీ మంత్రి పల్లె.

పుట్టపర్తి, :గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఎడ్లబండ పోటీలు, ఉత్సవాలు, ఊరేగింపులు, జాతరలను, కళావృ త్యాలు నాటకాలు, నాటి సంస్కృతిని సాటి చెప్పే చిహ్నాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం పుట్టపర్తి మండల పరిధిలోని సుబ్బరాయునిపల్లి గ్రామంలో నిర్వహించిన అక్కమ్మ గార్ల పరస మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు.రాష్ట్రంలో వర్షాలు సంవృద్ధిగా కురిసి ప్రజలు సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నారు. సుబ్బరాయనిపల్లి గ్రామ అటవీ ప్రాంతంలోని ప్రసిద్ధ అక్కమ్మ దేవత ఆలయంలో నియోజవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి జన్మదినం సందర్భంగా అక్కమ్మ దేవాలయాల్లో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించిన ఆయన, రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నాయకత్వంలో అన్ని విధాలుగా అభివృద్ధి చెంది అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవాలని ప్రత్యేకంగా మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి అక్కమ్మ దేవత ఆలయ పూజారులు, భక్తులు ఉరుములు, మేళతాళాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం సంప్రదాయబద్ధంగా ఎద్దుల బండిపై ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, టీడీపీ ప్రజాప్రతినిధులు మండల కన్వీనర్ సహకార సొసైటీ అధ్యక్షులు విజయ కుమార్ ,మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్ నాయక్ , ఆకుల కుల్లాయప్ప శివప్ప, డాక్టర్ రాఘవేంద్ర, భాస్కర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బొమ్మయ్య, నాగరాజు, పుల్లప్ప ,మహేష్ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# గురువుల ఆశీస్సులు విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం

### కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్




పుట్టపర్తి, :కర్ణాటక రాష్ట్రం దొడ్డబళ్లా పురం సమీపంలోని తాపసిహళ్లిలో వెలసిన శ్రీ పుష్పాండజ మహర్షి ఆశ్రమంలో, తొగటవీర క్షత్రియ కులగురువులు పూజ్యశ్రీ దివ్యజ్ఞానానంద గిరి స్వామివారి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించిన గురువందన మహోత్సవ కార్యక్రమంలో కదిరి నియోజక వర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్వామివారు, ఆశ్రమ ప్రతినిధులు, కుల పెద్దలు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ఆశీస్సులు అందుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలు (సర్టిఫికెట్లు), నగదు ప్రోత్సాహకాలు మరియు జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులను అభి నందిస్తూ వారి ఉన్నత విద్యాభ్యాసానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గురువు మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల కృషి కలిసివస్తేనే గొప్ప విజయాలు సాధ్యమవు తాయని అన్నారు. నేటి విద్యార్థులే రేపటి భారత నిర్మాణ శిల్పులని, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణ, అంకితభావం తో ముందుకు సాగాలని సూచించారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజ పురోగతికి ఎంతో అవసరమని, ఇటువంటి గురువందన కార్యక్రమాలు భారతీయ సంస్కృతి, గురు-శిష్య పరంపర గొప్పతనాన్ని చాటిచెబుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం పూజ్యశ్రీ దివ్యజ్ఞానానంద గిరి స్వామివారిని ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా దర్శించుకుని వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, తొగటవీర క్షత్రియ సంఘ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గద్వాల సోమన్నకు ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి జాతీయ పురస్కారం

కర్నూలు, :నందవరం మండల పరిధిలోని జడ్పీహెచ్ స్కూల్ నాగలదిన్నెలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న బాలబంధు గద్వాల



సోమన్నను "ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జాతీయ పురస్కారం వరించింది. ప్రతి ఏటా విద్యా ప్రదాత,విశ్రాంత అధ్యాపకులు స్వర్గీయ శ్రీ ముప్పవరపు వెంకటేశ్వ రావు, స్వర్గీయ ముప్పవరపు ఆదిలక్ష్మి తల్లిదండ్రుల పేరిట యం. వి. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారి కుమారుడు ఆ సంస్థ చైర్మన్ యం.లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి యం. విజయ లక్ష్మి దంపతులు, విచ్చేసిన ప్రముఖుల చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక అవార్డు రోటరీ క్లబ్, నెల్లూరులో అందు కున్నారు. అలాగే సోమన్న ప్రసన్న వదనం మరియు "చెంగల్వ పూదండ పుస్తకాలు ఆవిష్కరించి, సభకు పరిచయం చేశారు. అచిర కాల వ్యవధిలో శతాధిక పుస్తకాలు(106) వ్రాసి ముద్రించిన విషయం అందరికీ విదితమే, బాలసాహిత్యంలో బాల గేయ బ్రహ్మ గద్వాల సోమన్న అవిరళ కృషికిగానూ ఈ పురస్కారము ఇచ్చారు. యం . ఈ కార్యక్రమం. ఈ కార్యక్రమంలో సినీ, సీరియల్ నటుడు యం. మోహన్,ఆరెకటిక నాగేశ్వరావు,బొగ్గరపు రాధాకృష్ణ, సుబ్బయ్య, ఆదినారాయణ రెడ్డి మరియు ఎందరో మహానుభావులు పాల్గొన్నారు. ప్రతిష్టాత్మకమైన పురస్కార గ్రహీత గద్వాల సోమన్నను తోటి ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు మరియు విద్యార్థులు అభిందించారు.

# బళ్లారి రాఘవ జీవితం యువతకు ఆదర్శం

## జిల్లా రెవెన్యూ అధికారి మాలోల



అనంతపురం, :నాటకరంగ మహా నీయుడైన బళ్లారి రాఘవ జీవిత తత్వంనేటి యువతకు ఆదర్శం కావాలని డిఆర్ఓ మాలోల తెలిపారు.ఆదివారంఉదయంకలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో శ్రీ బళ్లారి రాఘవ 146వ జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి మాలోల పాల్గొని శ్రీ బళ్లారి రాఘవ చిత్రపటానికి పూల మాలలు వేసిఘనంగానివాళులర్పించారు.ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ తెలుగు నాటక రంగానికి బళ్లారి రాఘవ నటుడిగా మాత్రమే కాకుండా సమాజ మార్పుకు కృషిచేసిన మహానుభావునిగా పేర్కొన్నారు. మేధావిగా, వక్తగా, రచయితగా, దాతగా ఆయన పేరు చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోతుందన్నారు.అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో 1880 సంవత్సరం ఆగస్టు 2న జన్మించిన బళ్లారి రాఘవ చిన్న వయస్సులోనే నాటక రంగంలో అడుగుపెట్టి, తనఅభినయం,వాక్చాతుర్యంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసేవారని తెలిపారు. ముఖ్యంగా హరిశ్చంద్ర, పాదుకా పట్టాభిషేకం, సావిత్రి, బృహన్నల, రామరాజు చరిత్ర, రామదాసు, తప్పెవరిది, సరిపడని సంగతులు అనే నాటకాలు బాగా పేరు ప్రఖ్యాతులు పొందినట్లు గుర్తు చేశారు. అప్పట్లో శ్రీ బళ్లారి రాఘవ నాటకాల అభినయానికి జాతిపిత మహాత్మ గాంధీజీ కూడా మెచ్చుకున్నారని అన్నారు. తన జీవిత కాలంలో నాటక రంగం కోసం సంపాదించిన ధనాన్ని ప్రజల శ్రేయస్సు కోసం ఖర్చు చేసిన మహోన్నత వ్యక్తి బళ్లారి రాఘవ అని నటుడిగా మాత్రమే కాకుండా సమాజ సేవా దృక్పథం కలిగిన వ్యక్తిగా ఆంగ్లవాదులకు వ్యతిరేకంగా ఉద్యమించటంలో, మహిళల విద్యకు ప్రాధాన్యత ఇవ్వడంలో, తెలుగు సాహిత్యాభివృద్ధికి నూతన ఒరవడి తెచ్చిన మహానుభావులలో ఒకరిగా గుర్తింపు పొందారన్నారు.ప్రతి విద్యార్థి బళ్లారి రాఘవ జీవితం నుంచి తాము నేర్చుకోవలసిన పాఠాల్ని తెలుసుకోవాలి. కళను, సాహిత్యాన్ని దేశభక్తికి, నైతిక విలువలకు వేదికగా మార్చిన ఆయన జీవితం, నేటి యువతకు మార్గదర్శకంగా నిలవాలని జిల్లా రెవెన్యూ అధికారి మాలోల పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి రమణ రెడ్డి, లలిత కళా పరిషత్ కార్యదర్శి పద్మజ, ఆన్ సెట్ మేనేజర్ శ్రీనివాసులు, యువజన సంక్షేమశాఖ సుపరేంటెండెంటు అన్వర్ బాష, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ కళా సంస్థలకు చెందిన ప్రతినిధులు స్వచ్ఛంద సేవా సంస్థలు మరియు పలువురు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ బళ్ళారి రాఘవ 146 వ జయంతోత్సవం

## పాల్గొన్న పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ



పుట్టపర్తి,: శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ లోని మినీ కన్ఫారెన్స్ హాలు నందు జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ నాటక కళాకారుడు, నాటకరంగ పితా మహుడు శ్రీ బళ్ళారి రాఘవ 146వ జయంతోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు, ఆర్డీఓ సువర్ణ మాట్లాడుతూ తెలుగు నాటకరంగానికి, కళారంగానికి శ్రీ బళ్ళారి రాఘవ గారు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. వారి ఆదర్శాలను, కళా సేవలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపు నిచ్చారు,ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పిడి నరసయ్య ,టూరిజం మేనేజర్ ప్రతాప్ రెడ్డి,పలువురు జిల్లా అధికారులు, సచివాలయ సిబ్బంది, పర్యాటక శాఖ ప్రతినిధులు పాల్గొని రాఘవ సేవలను స్మరించుకున్నారు.

# మత్తు రహిత యువతే వికసిత్ భారతానికి బలం





## నషా ముక్త్ యువ్ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత

గోరంట్ల, :బ్రహ్మ కుమారీల ఆధ్వర్యంలో గోరంట్ల వాసవీ కళ్యాణ మండపంలో నిర్వహించిన నషా ముక్త్ యువ్ ఫర్ వికసిత్ భారత్" మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సవితమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ, దేశాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ జాతీయ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వా ములు కావాలని పిలుపు నిచ్చారు. డ్రగ్స్ అనే సామాజిక మహమ్మారి నుంచి యువతను కాపాడటం కుటుంబ సభ్యులు, ఉపాధ్యా యులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం అందరి ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు.డ్రగ్స్ నిర్మూలన కోసం దేశవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు, క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు నిర్వహించ డం ద్వారా ఆరోగ్యకర మైన జీవన విధానాన్ని ప్రోత్సహించనున్నట్లు చెప్పారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన ర్యాలీలు, చర్చా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.అనంతరం మంత్రి సవితమ్మ విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండడంతో పాటు, వాటి వినియోగాన్ని అరికట్టేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాన్ని బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నిర్వ హించగా, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్య క్రమంలో డైరెక్టర్ బ్రహ్మకుమారీ, హిందూపురం నెట్వర్క్ ఇంచార్డ్ సుగంధ దీదీ,ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బలరాం గుప్తా,సెంటర్ ఇన్చార్జ్ బ్రహ్మకుమారిస్ లేపాక్షి రాజయోగిని బి కే కమల సిస్టర్, పెనుగొండ సెంటర్ ఇన్చార్జ్ హేమలత ఉమాదేవి, శిల్ప, తో పాటు తహసిల్దార్ మధు నాయక్, ఎంపిడిఓ కమలా బాయి, సీఐ బోయ శేఖర్, హస్త కళల డైరెక్టర్ పులేరు సోమశేఖర్, మాజీ ఎంపీపీ నిమ్మల విద్య ధరణి, ప్రతినిధులు, జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్,మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి, పుట్టపర్తి సామకోటి ఆదినారాయణ, నిమ్మల శ్రీధర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.





# అర్ధరాత్రి అరెస్టులు... ప్రజాస్వామ్యానికి అర్ధరాత్రి చీకట్లు

## వైకాపా రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కురువ శశికళ కృష్ణమోహన్

ఆలూరు, :ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టును తీవ్రంగా ఖండించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కురువ శశికళ కృష్ణమోహన్ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని అర్ధరాత్రి వేళ అరెస్టు చేసిన ఘటన తీవ్ర ఆందోళన కలిగించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కురువ శశికళ కృష్ణమోహన్ పేర్కొన్నారు.ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్ష ప్రజాప్రతినిధులతో వ్యవహరించే తీరు ఇదేనా అని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని అధికార యంత్రాంగాన్ని రాజకీయ ప్రయోజనాలకు వినియోగిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో బలపడుతోందని ఆమె అన్నారు, ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకలను అణచివేయడానికి అర్ధరాత్రి అరెస్టులు, బెదిరింపులు, ఒత్తిళ్లు వంటి చర్యలు అవలంబించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు,ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేను అర్ధరాత్రి అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం ఎలాంటి సందేశాన్ని ఇవ్వాలను కుంటోంది? ప్రజల సమస్యలను ప్రశ్నిస్తే ఇదే పరిస్థితి ఎదురవుతుందా? అధికార అహంకారంతో వ్యవహరించే ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని" అని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు,ప్రజాస్వామ్యంలో విభిన్న స్వరాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని, కానీ ప్రస్తుతం ప్రశ్నించే వారిపై ఒత్తిడి తెచ్చే ధోరణి కనిపిస్తోందనే ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ విభేదాలను చట్టపరమైన చర్యల రూపంలో పరిష్కరించే ప్రయత్నాలు ప్రజాస్వామ్య విలువలను బలహీనపరుస్తాయని ఆమె అన్నారు.అధికారం శాశ్వతం కాదు... ప్రజా తీర్పే శాశ్వతం. అధికారం మదంతో వ్యవహరించే ప్రతి ప్రభుత్వానికి ప్రజలే అంతిమన్యాయమూర్తులని, అధికార బలం ఎంత ఉన్నా ప్రజా బలం ముందు నిలవదని కురువ శశికళ కృష్ణమోహన్ వ్యాఖ్యానించారు.చట్టం అందరికీ సమానంగా వర్తించాలే తప్ప రాజకీయ ప్రత్యర్థులపై మాత్రమే ఎంపిక చేసుకుని అమలు చేయకూడదని ఆమె డిమాండ్ చేశారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టుకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజల ముందుంచి పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు.రాజకీయ కక్షసాధింపులకు తావులేకుండా రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడాలని, ప్రతిపక్షాల పట్ల కక్షపూరిత ధోరణిని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు.



# పంట బీమాతోనే రైతుకు ధీమా

## అరకు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు దేవకోట వెంకట్ నాయుడు



**జియ్యమ్మవలస** ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతన్నకు పంట బీమానే కొండంత అండ అని, గడువు ముగిసేలోగా రైతులందరూ తప్పనిసరిగా పంట బీమా నమోదు చేసుకోవాలని అరకు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ దేవకోట వెంకట్ నాయుడు కోరారు. కొమరాడ మండలం విక్రంపురం గ్రామ పంచాయతీలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అరకు పార్లమెంట్ పరిధిలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా వరి పంట వేసిన రైతులు తమ బీమా నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు ఆర్థికంగా బాగుండాలని, ఏ ఒక్క రైతు నష్టపోకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ బీమా పథకానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. పంట నష్టపోయినప్పుడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ఈ అవకాశాన్ని ప్రతీ రైతు ఉపయోగించుకోవాలని తెలిపారు.రైతులు తమ పరిధిలోని గ్రామ సచివాలయాలు లేదా అగ్రికల్చర్ అసిస్టెంట్లను కలిసి క్రింది పత్రాలను సమర్పించాలని తెలిపారు, అలాగేఆధార్ కార్డు,పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్,1-బి,బ్యాంకు ఎకౌంటు జిరాక్స్,రైతులందరూ ఆఖరి తేదీ వరకు వేచి చూడకుండా, గడువు ముగిసేలోపే నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని దేవకోట వెంకట్ నాయుడు స్పష్టం చేశారు.

Edited, Printed And Published Owned By K. Naresh Kumar, Flat No: 309/2, Krishna Plaza, Khairatabad, Hyderabad-50004. TELANGANA STATE, Website: www. prajamudra.Com, Email:mudranewstelugu@gmail.com, cell: 9573800809